


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 425 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 18 మే 2025 | వెల : 4/-




బిన్‌లాడెన్ హతం తరహాలో

## ఆపరేషన్ సిందూర్

- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు
- భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసింది
- ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లింది
- 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయి
- "ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది

# మహిళలే దేశానికి ఆదర్శం

- ఆడ బిడ్డలకు అప్పు ఇస్తే పురోగతి
- కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే మా లక్ష్యం
- "మహిళా శక్తిని ప్రపంచానికి ఇందిరాగాంధీ చూపించారు
- రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలి
- మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చాం
- ఆడబిడ్డలకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం
- అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించాం
- మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చాం.



హైదరాబాద్

1971 లో పాకిస్థాన్ తో యుద్ధం జరిగినపుడు, ఇండియా–చైనా యుద్ధం జరిగినపుడు అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మహిళా శక్తిని ప్రపంచానికి చాటారని, దేశాన్ని గెలిపించిన శక్తి మహిళా శక్తి అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన చిఇ ఊబీఎ విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా శక్తిని కాంగ్రెస్ ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదు. మహిళా శక్తి దేశానికి అండ అని నిరూపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. దేశానికి మహిళలు ఆదర్శం. తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తికి చేయూతనిచ్చే పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి స్కీమ్ ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం - మిగతా3లో




జూన్ మొదటి వారంలో

## మంత్రివర్గ విస్తరణ

- మంత్రివర్గ విస్తరణపై మహేష్ గౌడ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్
- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను కొంతమంది కావాలనే వక్రీకరించారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- ప్రజలకు ఉన్న అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యం

హైదరాబాద్

మంత్రివర్గ విస్తరణపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈనెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని అన్నారు. వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణలో కొంతమేర జాప్యం జరుగుతోందని చెప్పారు. తమ ప్రభుత్వంలో మంత్రులు అందరూ కలిసే ఉన్నారని కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉన్న అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై సైబర్ క్రైమ్‌లో - మిగతా3లో



ఆమ్ ఆద్మీ పార్టీకి

## గట్టి దెబ్బ

- 13 మంది కౌన్సిలర్లు రాజీనామా..
- కొత్త పార్టీ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- "ఇంద్రప్రస్థ వికాస్ పార్టీ" పేరుతో కొత్త పార్టీ
- సీనియర్ కౌన్సిలర్ ముఖేష్ గోయెల్ ఈ పార్టీకి సారథ్యం వహించే అవకాశం

## పార్టీ కార్యక్రమాలు జూన్ నుంచి విస్తృతం



- పార్టీ నేతలకు విజయ్ కీలక ఆదేశాలు
- ఈ నెలాఖరులోపు పార్టీ పరంగా కమిటీలు, పదవుల భర్తీ ప్రక్రియలన్నీ పూర్తి
- ఎన్నికలకు మరికొన్ని నెలలు ఉన్న దృష్ట్యా, ఇక ప్రజల్లోకి వెళ్లే విధంగా కార్యాచరణ

## భారత సైన్యానికి సంఘీభావంగా తిరంగా ర్యాలీ



హైదరాబాద్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ట్యాంక్ బండ్ రోడ్డులో శనివారం(మే 17వతేదీ) సాయంత్రం సమయంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజకీయ, సినీ ప్రముఖులతో పాటు యువత, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు భారత్ మాతా కీ జై అంటూ నినాదాలతో హోరెత్తాయి. దీనిలో భాగంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 'వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జై జైలు కొట్టాలి. ఒకప్పుడు ప్రపంచానికి విశ్వ గురువు, ఆర్థిక శక్తి భారతదేశం. గొప్ప శక్తి ఉన్నప్పటికీ ఏ దేశం పై యుద్ధానికి కాలు - మిగతా3లో

2017 నాటి కేసు.. మంత్రి శ్రీధర్ బాబుపై

## కేసు కొట్టివేత



- కాళేశ్వరం భూ సేకరణ వివాదం కేసులో మంత్రి శ్రీధర్‌బాబుకు ఊరట
- శ్రీధర్‌బాబు సహా 13 మందిపై నమోదైన కేసును కొట్టివేసిన నాంపల్లి కోర్టు
- 2017లో కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు చేసిన గత ప్రభుత్వం
- న్యాయమే గెలిచిందని, ఇది రైతుల విజయమని శ్రీధర్‌బాబు వ్యాఖ్య

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన వివాదంలో నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఆయనతో పాటు మరో 12 మంది కాంగ్రెస్ నాయకులపై 2017లో నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఈ తీర్పు వెలువడిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, ఇది రైతుల విజయమని, చివరికి న్యాయమే గెలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. - మిగతా3లో




వీసా గడువు మించిందా..

## బహిష్కరణ వేటు తప్పదు

- ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడి
- బహిష్కరణ ముప్పు తప్పదు
- అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాలి
- భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ

# బీఆర్ఎస్‌లో చీలిక!

- తెలంగాణ షర్మిళ కవిత..
- బీఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట నడుస్తోంది
- పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోతే బీఆర్ఎస్ ఎల్పీ చీలిపోతుంది
- ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు షర్మిల తరహాలోనే ఇక్కడ కేటీఆర్‌కు కవిత తయారయ్యారు
- హరీశ్ రావు, కవితకు సహకరించేందుకు రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు
- సొంత ఎజెండా పెట్టుకుని పని చేయకూడదని కేటీఆర్ చెప్పడం ఇందుకు నిదర్శనం
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్

బీఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట నడుస్తోందని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోతే బీఆర్ఎస్ ఎల్పీ చీలిపోతుందని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో బీఆర్ఎస్‌లో చీలిక రానుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు షర్మిల తరహాలోనే ఇక్కడ కేటీఆర్‌కు కవిత తయారయ్యారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సొంత ఎజెండా పెట్టుకుని పని చేయకూడదని కేటీఆర్ చెప్పడం ఇందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, స్పీకర్ సాయం కూడా ఇందుకు అవసరమని మహేశ్వర్ రెడ్డి అన్నారు. హరీశ్ రావు, కవితకు - మిగతా3లో

# పాక్‌తో భారత్ దౌత్య యుద్ధం


**న్యూఢిల్లీ :** ఉగ్రవాదంపై భారతదేశం పోరాటం మరింత ఉధృతం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా భారతదేశం నుండి ఏడు ప్రతినిధి బృందాలను కేంద్రం నియమించింది. వీరు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టోలరెన్స్ విధానాన్ని ప్రపంచానికి చాటి చెప్పనున్నారు. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదంపై భారత్ నిరంతర పోరాటంపై కేంద్రం నియమించిన ప్రతినిధులు ఈ నెలాఖరులో జఔ భద్రతా మండలి సభ్యులతో సహా కీలక భాగస్వామిగా దేశాలలో పర్యటించనున్నారు. ఉగ్రవాద నిర్మూలనకు సహకరించాలని, ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు కోరనున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న సహించేది లేదన్న భారత్ నిర్ణయాన్ని స్వాగతించాలని ఎంపీల బృందం పలు దేశాల ప్రతినిధులను కోరనుంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారతదేశం ఏకాభిప్రాయం, సమైక్యతను అఖిలపక్ష ఎంపీ ప్రతినిధులు విదేశాలకు వెళ్లి భారత్ స్టాండ్‌ను చాటిచెప్పనున్నారు. విదేశాలలో భారత్ అభిప్రాయాన్ని తెలిపేందుకు ఇతర పార్టీల ఎంపీలతో కమిటీలు వేయడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి అయితే, గతంలో 1994లో ప్రధాని పీవీ నరసింహారావు ఐక్యరాజ్యసమితికి పంపిన ప్రతినిధుల బృందానికి విపక్షనేత ఏబీ వాజ్‌పేయి నాయకత్వం వహించారు. విపక్ష పార్టీకి చెందిన నేత అయినా, భారత్ గళాన్ని వినిపించడానికి కేంద్రం తరఫున విదేశాలకు వెళ్లిన తొలి నేతగా వాజ్‌పేయి నిలిచారు.పలు పార్టీల పార్లమెంటు సభ్యులు, ప్రముఖ రాజకీయ నేతలు, విశిష్ట దౌత్యవేత్తలు ప్రతి ప్రతినిధి బృందంలో ఉంటారు. కేంద్రం తాజాగా ఏర్పాటు చేసిన ప్రతినిధి బృందాలకు నాయకత్వం వహించేది వీరే.

1) శశి థరూర్, కాంగ్రెస్
2) రవిశంకర్ ప్రసాద్, ఃఏఖ
3) సంజయ్ కుమార్ ఝా, ఏఆఇ
4) బైజయంత్ పాండా, ఃఏఖ
5) కనిమొళి కరుణానిధి, ఆఓఐ
6) సుప్రియా సులే, ఔఅఖ
7) శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, శివసేన



మే 23 నుంచి దాదాపు పది రోజుల పాటు ఈ ప్రతినిధుల బృందాలు అమెరికా, యూకే, యూఏఈ, దక్షిణాఫ్రికా, జపాన్ దేశాలకు వెళ్లి పాకిస్తాన్ చేస్తున్న క్రాస్ బార్డర్ టెర్రరిజం, కాశ్మీర్ అంశంపై భారత్ ఎలా వ్యవహరించనుందని వివరించనున్నారు. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ ఎంపీల దౌత్యవేత్తల బృందాలను సమన్వయం చేయనున్నారు.ఉగ్రవాదంపై పోరాడేందుకు రాజకీయాలను పక్కనపెట్టి రావాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలకు సూచించింది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ తీసుకునే నిర్ణయాలను తాము స్వాగతిస్తామని పహల్గాంలో ఉగ్రదాడి తరువాత ఇటీవల జరిగిన అఖిపక్ష సమావేశంలో అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. అనంతరం కేంద్రం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని మొత్తం 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి నేలమట్టం చేసింది. అనంతరం నిర్వహించిన అఖిలపక్ష భేటీలోనూ కేంద్రం నిర్ణయాలకు తాము మద్దతిస్తామని ప్రకటించారు. ఉగ్రవాదంపై దేశమంతా ఏకం కావాల్సిన సమయం ఇదేనని, రాజకీయాలను పక్కనపెట్టాలని అన్ని పార్టీల నేతలు భావిస్తున్నారు. ఉగ్రవాదంపై పాక్ తీరును ఎండగట్టేందుకు, ప్రపంచ వ్యాప్తంగా పాక్ నిజస్వరూపం భయటపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ, బీజేపీ పార్టీల ఎంపీలతో కమిటీలు ఏర్పాటు చేసింది. మొత్తం ఏడుగురు ప్రతినిధులు నేతృత్వం వహించేలా ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం 7 గ్రూపులు ఐక్యరాజ్యసమితి సభ్యత్వం ఉన్న కొన్ని దేశాలకు వెళ్తాయి. ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోంది, భారత్ లో జరిగే ఉగ్రదాడులకు మూలాలు పాకిస్తాన్ లో ఎందుకున్నయో నేతల బృందాలు వివరించనున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో భాగంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఆవశ్యకతను వివరించనున్నారు.

## బిన్‌లాడెన్ హతం తరహాలో ఆపరేషన్ సిందూర్



**ఇంటర్నెట్‌డెస్క్:** ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా హతమార్చిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాక్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరివేసిందని వ్యాఖ్యానించారు. 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా మాట్లాడారు. "ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక బెంచ్ మార్క్‌ను నిర్ణయించింది" అని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లిందని అన్నారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్ 11, 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన ఉగ్ర దాడిలో సుమారు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మందిని పొట్టన పెట్టుకున్న అల్‌ఖైదా అధినేత బిన్ లాడెన్‌ను 2011 మే 2న అమెరికా దళాలు హతమార్చిన విషయం తెలిసిందే. యూఎస్ నేవీ సీల్ బృందం ప్రత్యేక కమాండో ఆపరేషన్ చేపట్టి అబోట్టాబాద్ కాంపౌండ్‌లో నక్కిన లాడెన్‌ను మట్టుబెట్టింది. నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 'ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్' పేరిట లాడెన్‌ను హతం చేశారు.

**ఆ దేశాలకు సాయం చేయలేం: ఉపరాష్ట్రపతి**

భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే దేశాల ఆర్థిక వ్యవస్థలకు సాయం చేయలేమని ధన్‌ఖడ్ అన్నారు. మనలో ప్రతి ఒక్కరు ఆర్థిక జాతీయవాదం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పాకిస్థాన్‌కు వత్తాసు పలికిన తుర్కియే, అజర్‌బైజాన్‌లపై భారత్‌లో బాయ్‌కాట్ నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## భారత్ దిశగా చైనా గూఢచార నౌక




**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ డ్రాగన్ దేశం కపటబుద్ధి మరోసారి బయట పెట్టుకుంది. ఆ దేశానికి చెందిన గూఢచార నౌక 'ద యాంగ్ యి హావో' భారత్ దిశగా వస్తోంది. ఈ విషయాన్ని డామియెన్ సిమోన్ అనే ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్ నిపుణుడు తెలిపారు. చైనాకున్న గూఢచార నౌకల్లో ఇదొకటి. వీటిని పరిశోధన నౌకలని చైనా చెప్పుకుంటున్నప్పటికీ, వీటిని నిఘా నౌకలుగానే భారత్ తదితర దేశాలు పరిగణిస్తున్నాయి. శాస్త్రీయ పరిశోధనలతో పాటు పౌర, సైనిక అవసరాలను తీర్చేలా వీటిని రూపొందించారు. సముద్ర జలాల్లో పరిశోధనలు, సముద్ర గర్భం మ్యాపింగ్, ఖనిజ, జీవ వనరుల అన్వేషణ పేరుతో సంచరించే ఈ నౌకలు క్షిపణుల గమనాన్ని ట్రాక్ చేయగలవు, సబ్‌మెరీన్ల కదలికలను పసిగట్టడం వంటివి చేయగలవు. తాజాగా, మలక్కా నుంచి బయలుదేరిన ఈ నౌక శ్రీలంక దక్షిణ తీరం దిశగా సాగుతున్నట్లు మ్యాప్‌ను బట్టి సిమోన్ విశ్లేషించారు. ఈ నౌకతో ప్రమాదమేమంటే.. ఇందులో మనుషులతో అవసరం లేకుండా సముద్రం అడుగున సంచరిస్తూ నిఘా కార్యకలాపాలను నిర్వహించే వాహనాలుంటాయి. సముద్రం అడుగున మందుపాతరలు, ఇతర సైనిక కార్యకలాపాలను కనిపెట్టి మ్యాపింగ్ చేస్తాయి. భారత్‌లో క్షిపణి పరీక్షలు, ఇతర సైనిక కార్యకలాపాల సమయంలో చైనా నిఘా నౌకలు పొరుగుదేశాలకు చేరుకుని గూఢచర్యం చేయడం ఇటీవలి కాలంలో మామూలై పోయింది. గతేడాది ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని%-%5ను ప్రయోగించిన సమయంలో చైనాకే చెందిన జియాంగ్ యాంగ్ హాంగ్ 01 అనే గూఢచర్య మన దేశ సమీపానికి వచ్చింది. ఒడిశాలోని బాలాసోర్ తీరం వెంబడి క్షిపణి పరీక్షలప్పుడు సైతం చైనా నిఘా నౌకలు తూర్పు తీరానికి సమీపంలోకి వచ్చినట్లు తెలిసింది. విశాఖ తీరంలోని సబ్‌మెరీన్లలోని అణు క్షిపణుల సిగ్నళ్లను సైతం ఇవి కనిపెట్టే అవకాశముందని సమాచారం.

## ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి దెబ్బ



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల అధికారం కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీకి మరోసారి గట్టి దెబ్బ తగిలింది. 13 మంది కౌన్సిలర్లు ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. "ఇంద్రప్రస్థ వికాస్ పార్టీ" పేరుతో కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సీనియర్ కౌన్సిలర్ ముఖేష్ గోయెల్ ఈ పార్టీకి సారథ్యం వహించే అవకాశం ఉంది. తమకు 15 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నట్లు కూడా తిరుగుబాటు వర్గం ప్రకటించుకుంది. 2022 ఎంసీడీ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఆప్ అధినాయకత్వం ఎంసీడీలో పలు అవకతలకు పాల్పడిందని, కౌన్సిలర్లకు, పార్టీ నాయకత్వానికి మధ్య తీవ్రమైన అగాధం ఏర్పడిందని తిరుగుబాటు వర్గం ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసిన కౌన్సిలర్లలో దినేష్ కుమార్ (వార్డ్ నెంబర్ 2), హిమానీ జైన్ (వార్డ్ 153), రునాక్షి శర్మ (వార్డ్ 88), ఉషా శర్మ (వార్డ్ 72), అశోక్ పన్వార్ (వార్డ్ 109), సాహిబ్ కుమార్ (వార్డ్ 107), రాజేష్ కుమార్ లడి (వార్డ్ 99), మనీషా కల్రా (వార్డ్ 33), సుమాని అనిల్ (వార్డ్ 22), అశోక్ కుమార్ పాండే (వార్డ్ 109), ముఖేష్ గోయెల్ (వార్డ్ 15), దేవేంద్ర కుమార్ (వార్డ్ 196), హేమ్‌చంద్ గోయెల్ (వార్డ్ 181), రాణి ఖేడా (వార్డ్ 33) ఉన్నారు. కాగా, ఆప్ నాయకత్వంలో ఎంసీడీ పనితీరుతో తాము అసంతృప్తిగా ఉన్నట్టు కౌన్సిలర్ హిమాని జైన్ తెలిపారు. ఆ కారణంతోనో తాను, మరికొందరు కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసి 'ఇంద్రప్రస్థ వికాస్ పార్టీ' పేరుతో కొత్త పార్టీ ఏర్పాటుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఇంతవరకూ 15 మంది కౌన్సిలర్లు రాజీనామా చేశారని, రాబోయే రోజుల్లో మరికొందరు కూడా తమతో కలిసే అవకాశం ఉందని తెలిపారు.

## పార్టీ కార్యక్రమాలు జూన్ నుంచి విస్తృతం



**చెన్నై:** పార్టీ పరంగా కమిటీలు, పదవుల భర్తీ ప్రక్రియలన్నీ ఈ నెలాఖరులోపు ముగించే విధంగా ముఖ్య నేతలకు తమిళగ వెట్రి కళగం నేత విజయ్ ఆదేశాలు ఇచ్చారు. పార్టీ కార్యక్రమాలను జూన్ నుంచి విస్తృతం చేయడానికి సిద్ధమయ్యారు. పార్టీ ఏర్పాటుతో జిల్లాల కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలను విజయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో ముఖ్య పదవులన్నీ దాదాపుగా భర్తీ అయ్యాయి. ఇతర కమిటీలలో కొన్ని పదవుల భర్తీ కసరత్తులు జరుగుతున్నాయి. ఎన్నికలకు మరికొన్ని నెలలు ఉన్న దృష్ట్యా, ఇక ప్రజల్లోకి వెళ్లే విధంగా కార్యాచరణలో విజయ్ ఉన్నారు. ప్రస్తుతం విజయ్ నటిస్తున్న జననా యగన్ చిత్ర షూటింగ్ ఈనెలతో ముగియనున్నట్టు తెలిసింది. ఆ తర్వాత జూన్ మొదటి వారం నుంచి విజయ్ పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా ప్రజల్లో ఉండబోతున్నారు. ఇందులో భాగంగా విజయ్ పర్యటనలకు సంబంధించి గత రెండు రోజులుగా చెన్నైలో జిల్లాల కార్యదర్శుల సమావేశం విస్తృతంగా సాగుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి భుస్సీ ఆనంద్ పర్యవేక్షణలో ఈ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పార్టీ పరంగా అన్ని ప్రక్రియలను, పదవుల భర్తీని ఈ నెలాఖరులోపు ముగించాలని విజయ్ ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. జూన్ నుంచి ఆయన పూర్తి స్థాయిలో ప్రజల్లో ఉండబోతున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ సైతం సిద్ధమవుతోంది.

## వీసా గడువు మించిందా..
# బహిష్కరణ వేటు తప్పదు




ఇంటర్నెట్‌డెస్క్: నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే.. భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తివ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బం దులు ఏర్పడితే.. చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కాగా.. అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. "అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు.అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి" అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

## భారత్‌కు ద్రోహం..
# పాక్‌కు గూఢచర్యం చేస్తున్న విద్యార్థి అరెస్ట్

**ఛండీగఢ్:** దేశ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటూ, పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్న విద్యార్థిని హర్యానా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. వివరాల ప్రకారం.. నిందితుడు దేవేంద్ర సింగ్ ధిల్లాన్ హర్యానాలో పాటియాలలో ఉన్న ఖల్సా కళాశాలలో పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. అయితే, మే 12న ధిల్లాన్.. తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. ఈ విషయం పోలీసులు దృష్టికి చేరడంతో.. కాలేజీకి వెళ్లి ఆరా తీశారు. అనంతరం, అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దేవేంద్రసింగ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ దర్యాప్తునకు పంపించారు. ఈ క్రమంలో ధిల్లాన్ విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో భాగంగా.. ధిల్లాన్ గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాకిస్తాన్‌కు వెళ్లినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు తేలిపింది. ఈ మేరకు నిందితుడు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడు. దీంతో, డబ్బు లావాదేవీలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల ఉత్తరప్రదేశ్ చెందిన రవీంద్రకుమార్‌కు సైతం ఇలాగే పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్తాన్‌లోని ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్న కారణంగా రవీంద్రకుమార్‌ను విచారిస్తున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రవీంద్రకుమార్ ఓ అమ్మాయితో హానీట్రాప్‌లో చిక్కి.. భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్ అధికారులకు చేరవేశాడు. ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో, అతడి అంశంలో మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.



# బీఆర్ఎస్‌లో చీలక!

-మొదటిపేజీ తరువాయి

సహకరించేందుకు రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని ఆరోపించారు.తండ్రి, కొడుకు, కూతురు, అల్లుడు మధ్య విభేదాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. రజతోత్సవ సభలో కేటీఆర్‌దే పెత్తనమని.. కవిత, హరీశ్ రావుకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదని అన్నారు. హరీశ్, కవిత డమ్మీగా మిగిలారని చెప్పారు. పలు కారణాలతో కేసీఆర్ క్రియాశీలకంగా ఉండటం లేదని తెలిపారు. సభలో కూడా అంత యాక్టివ్‌గా లేరని అన్నారు.తన తరువాత బీఆర్ఎస్ చీఫ్ కేటీఆర్ అని పరోక్షంగా ఇండికేషన్ ఇచ్చారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. డీఫాల్ట్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నారని, కేసీఆర్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని వ్యాఖ్యానించారు. సభలో తండ్రీకొడుకులు కీలకంగా వ్యవహరించారని, కవిత, హరీశ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు.కవిత ఒంటరి అయ్యారని, ఆదిపత్య పోరు తారస్థాయికి చేరిందని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. మహిళా సమానత, సామాజిక తెలంగాణ సాధన అంశంలో బీఆర్ఎస్ విఫలమైందని కవిత అన్న వ్యాఖ్యలు వ్యూహాత్మకమేనని అన్నారు. పదవులు, ఆస్తులు అన్ని కేటీఆర్‌కేనా అంటే లేఖాస్త్రంలో కవిత తిరుగుబాటు చేశారని తెలిపారు.కవిత కేసీఆర్ పదేళ్ల పాలనపై విమర్శలు చేస్తున్నారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ కు రాసిన లేఖ త్వరలోనే బయటపెట్టే అవకాశం ఉందని అన్నారు. కేటీఆర్‌కే అన్ని ఇస్తుండటంతో కవిత తిరుగుబాటు జెండా ఎగురవేశారని చెప్పారు. తనను రాజకీయంగా అణిచి వేసేందుకు కేటీఆర్ కుట్ర చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారని తెలిపారు.మేడే రోజున తండ్రి పాలనా వైఫల్యాలు ఎండగట్టారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. తనను రెచ్చగొడితే మరింత రెచ్చిపోతానని చెప్పడం ఆమెలోని ఆవేదన బయటపడిందని అన్నారు. బీఆర్ఎస్‌లో ఒకే పవర్ సెంటర్ ఉండాలని కేటీఆర్ అభిమతమని అన్నారు. బీఆర్ఎస్ పై విమర్శలు చేసిన వెంటనే హరీశ్ రావు మీడియా సమావేశం పెట్టడం వెనక కేసీఆర్ హస్తం ఉందని చెప్పారు.పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ అయితే ఎల్పీ నేత





అవకాశం తనకు ఇవ్వాలని హరీశ్ రావు కండీషన్ పెట్టారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. పదిమందిని తీసుకుని వేస్తే ఎల్పీ నేత అవకాశం ఇస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఆరోపించారు. అందుకే హరీశ్ రావు దగ్గరికి కేటీఆర్ వచ్చి చర్చించారని అన్నారు. ఎల్పీతో పాటు అధ్యక్షుడిగా కూడా తానే ఉంటానని కేటీఆర్ చెప్పారని తెలిపారు. హరీశ్ రావు ఆలోచనలు మారిపోయాయని అన్నారు.ముందు వెళ్లిన పది మందికి తోడు మరో పదిమందిని తీసుకుని వస్తే ఎల్పీ నేత చేస్తానని హరీశ్‌కి రేవంత్ రెడ్డి చెప్పారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇదే జరిగితే కొంప మునుగుతుందని కేటీఆర్ భయపడ్డారని అన్నారు. హరీశ్ వెంట 13 మంది, కవితతో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడిన పది మందిని కలుపుకుంటే మొత్తం 27 మంది అవుతారని, ఎల్పీ నేతను చేయడానికి సహకరిస్తానని హరీశ్‌తో సీఎం అన్నారని ఆరోపించారు

బీఆర్ఎస్‌ను చీల్చడం రేవంత్ రెడ్డితో కాలేదని.. అందుకే హరీష్‌ను అడ్డం పెట్టుకొని తన పంతం నెగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఫారిన్ టూర్‌లోకి వెళ్లగానే బీఆర్ఎస్‌లో చీలిక రాబోతోందంటూ సంచలన కామెంట్స్ చేవారు. ఈ నెలాఖరులోగా లేదా మొదటి వారంలో చీలిక వస్తుందన్నారు. చీలిక కోసం తెరవెనుక జరగాల్సిన తంతు రేవంత్ రెడ్డి సహకారంతో హరీష్ రావు, కవితలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో ఉంటే తమకు ఎదిగే అవకాశం ఉండదని హరీష్, కవితలు ఈ వ్యూహానికి తెరతీశారంటూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెన్షేషనల్ కామెంట్స్ చేశారు.

# అధికారులపై మంత్రులు గుర్రు

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మంత్రులకు, ఉన్నతాధికారులకు మధ్య అంతగా పొసగడంలేదన్న వార్తలు విన్పిస్తున్నాయి. మంత్రులు, అధికారుల మధ్య ఎక్కడా సమన్వయం కుదరడంలేదన్న వార్తలు ఇప్పుడు సచివాలయ వర్గాల్లో హాట్ టాపిగ్గా మారాయి. మంత్రుల సూచనల మేరకు పని చేయాల్సిన ఉన్నతాధికారులు నిబంధనల సాకుతో వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది.పదిమంది మంత్రుల్లో మెజారిటీ మంత్రులకు ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయన్న గుసగుసలు సచివాలయ వర్గాల్లో వినిపిస్తున్నాయ్..మంత్రులుగా ఉన్న తమ మాట కూడా తమ శాఖ అధికారులే వినకపోతే ఇంకెవరి మాట వింటారంటూ అమాత్యులు ఫైర్ అవుతున్నారట. మంత్రులు-అధికారులు పాలు, నీళ్లలా కలిసిపోయి పరిపాలనను పరుగులు పెట్టించాల్సింది పోయి?ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఇద్దరి మధ్య గ్యాప్ రోజు రోజుకి పెరిగిపోతుందట.దీంతో కొంతమంది మంత్రులు..తమ తమ పేషీల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులపై ఏకంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తోంది. సంక్షేమ పథకాలు, వాటి అమలు కోసం ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. సంక్షేమ పథకాలపై, పాలనలో తమ మార్కు వేసుకునేలా మంత్రులు పావులు కదుపుతున్నా అధికారులు మాత్రం..అమాత్యుల ఆదేశాలను ఎక్కడికక్కడ బ్రేకులు వేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయా శాఖల్లో గుస గుసలు విన్పిస్తున్నాయి.ప్రభుత్వ ప్రాధాన్యతలు ఒకటైతే అధికారుల ప్రాధాన్యతలు మరోలా ఉంటుండడంతో ఆ ప్రభావం పాలనపై స్పష్టంగా కనిపిస్తుందన్న చర్చ సచివాలయవర్గాల్లో జరుగుతోంది. ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్ కనీసం సంబంధిత మంత్రి సీతక్కకి సమాచారం ఇవ్వకుండా టెండర్లను రద్దు చేయడం ఇప్పుడు హాట్ హాట్ గా మారింది. ఈ విషయం తెలిసిన మంత్రి సీతక్క?సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.అయితే ఆది తనకు సంబంధం లేదని .. పై అధికారులు నిర్ణయం తీసుకున్నారంటూ సదరు అధికారి చెప్పినట్లు తెలిసింది . ఇక టూరిజం పాలసీ విషయంలోను సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండానే పాలసీలో మార్పులు చేయడంతో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశాఖ ఉన్నతాధికారిపై అసహనం వ్యక్తం చేశారనే టాక్ అప్పట్లో వినిపించింది .. అటు ఎక్సైజ్ శాఖలోనూ నిబంధనలను బూచిగా చూపిస్తూ అధికారులు మంత్రి మాట వినడం లేదట .. ఇక ఆర్ ఉఅండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల కొన్ని పనులను చేసిపెట్టాలని ఆదేశించినా సదరు



ఉన్నతాధికారి ఆ పనులు చేయడం సాధ్యంకాదని మంత్రి ముందే స్పష్టం చేశారట.ఫలానా పని చేయాలని తాను చెప్పినా అధికారి సాధ్యంకాదని చెప్పడంతో మంత్రి సైతం సైలెంట్ గా ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. ఇక ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు కూడా తన శాఖల పరిధిలోని ఓ ఉన్నతాధికారికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలన్నా .. ఆయన ఎప్పడు ఎలా రియాక్ట్ అవుతారో అర్థం కాక తల పట్టుకుంటున్నారట ? అటు ఇరిగేషన్ శాఖలో కూడా ఉన్నతాధికారి వ్యవహరించిన తీరు గతంలో చర్చనీయాంశంగా మారిందట.సదరు అధికారి కి మంత్రి కాల్ చేసినా రెస్పాండ్ కాకపోవడం అప్పట్లో హాట్ టాపిక్ గా మారింది .. ఇదంతా ఒక ఎత్తైతే మరికొందరు మంత్రులు తమ శాఖ అధికారులకు ఇతర మంత్రులెవరూఎలాంటి ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవద్దని హుకుం జారీ చేస్తున్నారట .. దేనితో ఆయా శాఖలా ఉన్నతాధికారులెవరూ ఇతర మంత్రుల కాల్స్ కూడా అటెండ్ అవ్వడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి

మంత్రులు, అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తేనే అప్పుడప్పుడూ సమస్యలు పరిష్కరం కావడంలో కొంత జాప్యం జరుగుతుంటుంది. కానీ అధికారులు, మంత్రుల మధ్య అసలు సమన్వయమే లేకుండా వ్యవహరిస్తుండడంతో ఆ ప్రభావం పాలనపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా కొంతమంది ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరుతో అమాత్యులు కూడా వారి తీరుపై ఎలా వ్యవహరించాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం.అంతేకాదు?తమ తమ పేషీల్లో కొన్ని ఫైల్స్ క్లియరెన్స్ కూడా తమ అనుమతి, ప్రమేయం లేకుండా నేరుగా సీఎంవో కార్యాలయంతోనే కొందరు అధికారులు సంప్రదిస్తు క్లియర్ చేసుకోవడంపైన కూడా మంత్రులు తీవ్ర ఆగ్రహం తో తమలో తామే గింజుకుంటున్నారట.తమ పేషీల్లోనే పనిచేస్తూ తమకే తెలియకుండా నేరుగా సీఎంవో ఆఫీసు నుంచే ఉన్నతాధికారులు పనిచేస్తుండడాన్ని అమాత్యులు జీర్ణించులేకపోతున్నారట.. ఓ మంత్రి పని తీరుపై ఫిర్యాదులు రావడంతో ఆ శాఖ ఫైల్స్ ను సీఎం రేవంతే నేరుగా పరిశీలిస్తున్నారన్న టాక్ సచివాలయవర్గాల్లో కలకలం రేపుతోంది ? అయితే తమ తమ శాఖలపై అమాత్యులు పట్టు సాధించకపోవడంతోనే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది. ఏదేమైనా ఈ వ్యవహారం మాత్రం సచివాలయం లో తీవ్ర చర్చకు దారితీస్తుందిమరి ఇప్పటికైనా మంత్రుల పేషీల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు మినిస్టర్స్ ఆదేశాలను పాటిస్తారా? లేక ఎప్పటిలాగే డోంట్ కేర్ అనే రీతిలోనే ఉంటారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మంత్రుల మాట వినని అలాంటి ఉన్నతాధికారులపై సీఎం రేవంత్ ఎలాంటి స్టెప్స్ తీసుకోబోతున్నారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## ఎన్ ఆర్ ఐలకు అమెరికా షాక్

**హైదరాబాద్ :** ఔఖీఎలకు అమెరికా మరో బిగ్ షాక్ ఇవ్వబోతుంది. అమెరికా పార్లమెంటులో కొత్త బిల్లు ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం. రిపబ్లిక్ పార్టీ కొత్తగా ఒక పన్ను చట్టాన్ని తీసుకురావాలని చూస్తోంది. ఇదే జరిగితే అమెరికాలోని లక్షలాది మంది భారతీయులకు పెద్ద ఎదురుదెబ్బ.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ది వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పేరుతో కొత్త పన్ను చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నారు. అమెరికాలో ఉన్న విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు పంపే నగదు బదిలీలపై 5 శాతం పన్ను విధించాలని ఆయన సూచించారు. ఈ కొత్త రెమిటెన్స్ పన్ను ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా ప్రతినిధుల సభలో బిల్లుగా ప్రవేశపెడతారు. ఇది అమల్లోకి వస్తే, అమెరికాలో పనిచేస్తున్న ఊ-1బీ వీసాదారులు, గ్రీన్ కార్డు కలిగినవారు, తాము పంపే డబ్బుపై 5 శాతం అదనపు భారం మోపాల్సి వస్తుంది.రియల్ ఎస్టేట్, విద్య, వైద్య ఖర్చుల కోసం తమ దేశానికి డబ్బు పంపే డబ్బులపై భారీగా భారం పడనుంది. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 11వందల 60 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే, అందులో ఐదు శాతం.. రూ.5వేలను పన్నుగా చెల్లించాలి. హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే..! అమెరికా పార్లమెంటులో సమర్పించబోయే ఈ కొత్త బిల్లు 389 పేజీల పొడవు ఉంది. పేజీ నంబర్ 327లో ఒక లైన్ రాసి ఉంది. అమెరికా పౌరుడు కాకపోతే, జూ వెలుపలకు పంపిన డబ్బుపై 5 శాతం పన్ను విధించడం జరుగుతుంది.ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, రెమిటెన్స్ రూపంలో అత్యధికంగా ఆదాయం పొందే దేశంగా భారత్ 2008 నుంచి మొదటిస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది ప్రపంచ మొత్తం రెమిటెన్స్‌లలో 14 శాతం భారత్‌కు వచ్చిందని అంచనా. అమెరికా ప్రభుత్వ నిర్ణయం, లక్షలాది మంది భారతీయ ప్రవాసులకు ఆర్థికంగా కొత్త భారంగా మారే అవకాశముంది.ఇది ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అమెరికాలో దాదాపు 45 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది ఊ-1ః లేదా ఒ-1 వీసాపై, గ్రీన్ కార్డ్ హోల్డర్లు ఉన్నారు. ఈ వ్యక్తులు ప్రతి నెలా ఇంటికి డబ్బు పంపుతారు. కొన్నిసార్లు వారి తల్లిదండ్రుల మందుల కోసం, కొన్నిసార్లు వారి సోదరి, సోదరుల చదువు కోసం, కొన్నిసార్లు ఎవరికైనా వివాహానికి సహాయం చేయడానికి.. ఇలా పంపించే వాటన్నింటిపై ట్రంప్ ప్రభుత్వం పన్ను విధించబోతోంది.

## 2017 నాటి కేసు..
## మంత్రి శ్రీధర్ బాబుపై కేసు కొట్టివేత

-మొదటిపేజీ తరువాయి

2017లో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూసేకరణపై ప్రజా విచారణ జరుగుతున్న సమయంలో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన తాము నిలిచామని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. "రైతుల హక్కులను కాపాడాలని, వారికి న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే, అప్పటి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు బనాయించింది" అని ఆయన వివరించారు. దాదాపు ఎనిమిదేళ్లపాటు ఈ కేసు విచారణ కొనసాగిందని, తాజాగా నాంపల్లి కోర్టు ఈ కేసును కొట్టివేయడం సంతోషకరమని శ్రీధర్‌బాబు తెలిపారు. "ఇది ప్రజా విజయం, రైతుల విజయం. పేద రైతుల ఆవేదనను న్యాయస్థానం ఆలకించింది. నాడు అధికారం చేతిలో ఉందని మాపై అక్రమంగా కేసులు పెట్టారు, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారు" అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ఉందని, తాము చట్టాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మాకు అధికారం ఉందని ఎక్కడా దాన్ని దుర్వినియోగం చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత కూడా సరిగా లేదు. దానిపై విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వారు ఎవరైనా సరే, చట్ట ప్రకారం శిక్ష అనుభవించాల్సిందే" అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

## మహిళలే దేశానికి ఆదర్శం

-మొదటిపేజీ తరువాయి

కల్పించి మహిళలకు సోనియాగాంధీ నజరానా అందించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆడబిడ్డలకు అప్పగించాం. విద్యార్థుల యునిఫాం కుట్టుపనిని మహిళా సంఘాలకు అప్పగించి వారికి భరోసా కల్పించాం. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాలను చేసేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. అదానీ, అంబానీలకు పరిమితమైన వ్యాపారాలను మహిళలు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. శిల్పారామంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు స్టాల్స్ ను కేటాయించాం ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని మేం నమ్ముతున్నాం. స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటికి పెంచుకోవాలి. మీకు ప్రోత్సాహం అందిస్త దేశంలో 16 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు అప్పు ఇస్తే ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్లారు. కానీ ఆడబిడ్డలకు అప్పు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగ్గొట్టకుండా వడ్డీతో సహా చెల్లిస్తున్నారు ఆర్థిక క్రమశిక్షణ మా ఆడబిడ్డల సొంతం. ఇప్పటికే వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని మహిళలకు అప్పగించాం. మీరు సమర్థవంతంగా నిర్వహిస్తే అవసరమైతే మరో వెయ్యి మెగావాట్ల సోలార్విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వాటినే రాష్ట్రానికి వచ్చే అతిథులకు బహుమతులుగా అందిస్తున్నాం. మా ఆడబిడ్డలను ప్రోత్సహించడమే మా ప్రభుత్వ విధానం. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని' రేవంత్ రెడ్డి అన్నారు.

## జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ

-మొదటిపేజీ తరువాయి

కేసు పెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తామని చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో టీపీసీసీ కార్యవర్గం ఖరారయ్యే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణలో సీఎం మార్పు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారమేనని విమర్శించారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ ఆందోళన సర్వ సాధారణం, మహిళలకు కాంగ్రెస్‌లో ఉన్న ప్రాధాన్యం మరే పార్టీలో లేదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న సరస్వతి పుష్కరాలు..
## హాజరైన మంత్రి తుమ్మల

**భూపాలపల్లి:** కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. పుష్కర ఘాట్‌లో మూడో రోజు పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం కారణంగా రహదారులన్నీ బురదమయంగా మారాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పుణ్య స్నానం ఆచరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

పుష్కరాలకు వెళ్లే భక్తులకు టోల్ ట్యాక్స్ రద్దు

కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేశారు. ఈమేరకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. వాహనాల రద్దీ నియంత్రణకు టోల్ ట్యాక్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.

## భారత సైన్యానికి సంఘీభావంగా తిరంగా ర్యాలీ

-మొదటిపేజీ తరువాయి

తీయలేదు. మన దేశాన్ని కాపాడకోవడానికి ఎదురు దాడికి దిగాం. ప్రధాని నరేంద్ర మోదీ విలక్షణమైనటువంటి వ్యూహంతో వ్యవహరించారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఇండియా ఉంది. దేశ ఐకమత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. టెర్రరిజాన్ని అణిచివేయాల్సిన అవసరం ఉంది. కశ్మీర్ సమస్య కాదు...కశ్మీర్ ఇండియాలో పార్ట్. పీవోకేపై మాత్రమే ఇప్పుడు చర్చ. మధ్యవర్తిత్వం వర్తించడానికి అమెరికా జోక్యం అవసరం లేదు. మన సమస్యను మనం పరిష్కరించుకోగలం' అని ఆయన స్పష్టం చేశారు.

## పోలీస్ వాహనాలకు పెట్రో బకాయిలు

**అదిలాబాద్ :** తెలంగాణలో పోలీసు శాఖ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. పోలీస్ వాహనాలకు పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోవడంతోపాటు, స్టేషన్ నిర్వహణ, వాహన మరమ్మతులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులు పెండింగ్‌లో ఉండడం వల్ల పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో, ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పోలీస్ కమిషనరేట్‌లు, ఎస్పీ కార్యాలయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.పోలీస్ వాహనాలకు ఇంధన సరఫరా కొరత రాష్ట్రవ్యాప్తంగా సమస్యగా మారింది. జనవరి 2025 నుంచి పెట్రోల్, డీజిల్ బిల్లులు చెల్లించకపోవడంతో ఇంధన సరఫరాదారులు సేవలు నిలిపివేస్తున్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో రూ. కోటికి పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండగా, సిరిసిల్ల, రామగుండం ప్రాంతాల్లో రూ.40 లక్షలకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో, అత్యవసర పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపడం కష్టతరంగా మారింది.పోలీస్ స్టేషన్‌ల నిర్వహణకు కేటాయించాల్సిన బడ్జెట్ కూడా గత మూడు నెలలుగా అందడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రెండు కమిషనరేట్‌లు, రెండు ఎస్పీ కార్యాలయాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. స్టేషన్‌లలో కనీస సౌకర్యాలైన కార్యాలయ సామగ్రి, విద్యుత్ బిల్లులు, ఇతర నిత్యావసరాలకు కూడా నిధులు అందక, సిబ్బంది సొంత ఖర్చులతో ఈ బాధ్యతలను నిర్వహిస్తున్నారు .పోలీస్ వాహనాల మరమ్మతులకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించకపోవడంతో, వాహనాలు రిపేర్ కాకుండా గ్యారేజీల్లోనే ఉంటున్నాయి. దీనివల్ల అత్యవసర సమయాల్లో పెట్రోలింగ్, నేర నియంత్రణ వంటి కీలక విధులు దెబ్బతింటున్నాయి. కొన్ని సందర్భాల్లో, పోలీసులు సొంత డబ్బుతో రిపేర్‌లు చేయించి, బిల్లులు సమర్పించిన తర్వాత సర్దుబాటు చేసుకునే పరిస్థితి నెలకొంది.నిధుల కొరతతో పోలీసు సిబ్బంది తమ సొంత జేబుల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంధనం, స్టేషన్ నిర్వహణ, వాహన రిపేర్‌ల కోసం ఖర్చు చేసిన డబ్బును తిరిగి పొందడానికి నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఆర్థిక ఒత్తిడి వల్ల పోలీసుల ఉత్సాహం, విధి నిర్వహణపై ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు


# సంపాదకీయం

## వెనక్కి తగ్గిన అమెరికా - చైనా

వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హె లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది. గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా%-%చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి. చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి. వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి. ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది. ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు. అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, మున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం. నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు. సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. మున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

# అణ్వస్త్రాలు.. అట్టకత్తులు కావు!

పహల్గాం మారణహోమం అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ ఉద్రిక్తతల సమయంలో పాకిస్థాన్ అనాలోచితంగా అణ్వస్త్రాల ప్రస్తావన తెరపైకి తేవడం కూడా తెలిసిందే. పాకిస్థాన్ అణ్వస్త్రాల ప్రస్తావన తేవడం చాలా ఆశ్చర్యం, ఆందోళన కలిగించవలసిన విషయం. పాకిస్థాన్, భారత్ వద్ద అణ్వస్త్రాలున్న సంగతి ప్రపంచానికి తెలుసు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అణ్వాయుధాల ప్రస్తావన తేవడం ఆషామాషీ వ్యవహారం కాదు. అణ్వస్త్రాలున్న రెండు పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ ఆ ఆయుధాల ప్రస్తావన తేవటం అంటే ఆ ఆయుధాలను వాడతామని చెప్పటమే కదా! అటువంటి ఆలోచనే విస్మయం కలిగించే విషయం. ఇది అత్యంత బాధ్యతారహితమైన ఆలోచన. ఎందుకంటే అణ్వాయుధాలను ప్రయోగించి యుద్ధం చేస్తే గెలిచేవారు ఉండరు. యుద్ధాలు గెలవాలనే చేస్తారు ఎవరైనా. యుద్ధం ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాలేదు చరిత్రలో. యుద్ధంలో గెలుపు మరో కొత్త సమస్యకు పురుడు పొయ్యటం మనకు తెలుసు. అయినా యుద్ధం చెయ్యటం మానుకోలేకపోతున్నాడు మనిషి. అణ్వాయుధాలను వాడితే గెలుపు అనేది ఉండదు. మనకు పాకిస్థాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో విజ్ఞులైన నమస్తే తెలంగాణ పాఠకులకు, సామాన్య ప్రజలకు అణ్వాయుధాల మీద అవగాహన కలిగించటమే ఈ వ్యాసం ఉద్దేశం. అణ్వస్త్రాల గురించి తెలుసుకోవాలంటే ముందు ఎన్‌పీటీ అనే దాన్ని గురించి అర్థం చేసుకోవాలి. అణ్వస్త్రాల విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఇది అత్యంత కీలకమైన అంశం. ఎన్‌పీటీ అంటే న్యూక్లియర్ నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ. అంటే అణ్వస్త్రాల వ్యాప్తి నిరోధక ఒప్పందం. అణ్వస్త్రాలకు సంబంధించిన సాహిత్యం అంతా ఆంగ్లంలో ఉన్నది. పదజాలం కూడా ఎక్కువగా ఆంగ్లంలోనే ఉంది. వీలైనంత వరకు తెలుగులోకి మార్చి చెప్తాను. ఎన్‌పీటీ అనేది చాలా మంది విని ఉంటారు, అందులో ఏముందో లోతుగా తెలియకపోయినా. ఇక్కడ ఎన్‌పీటీని లోతుగా పరిశీలిద్దాం. 1968లో ఈ ఎన్‌పీటీ ఒప్పందానికి ప్రపంచదేశాలు సంతకం చేసి ఆమోదం తెలిపే ప్రక్రియ మొదలైంది. ఈ ఒప్పందం 1970 మార్చి 5వ తేదీన అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం 1967 జనవరి 1కి ముందు అణు విస్ఫోటనం చేసిన దేశాలు అణ్వస్త్ర దేశాలుగా గుర్తింపు పొందాయి. వాటిని న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అంటే అణ్వస్త్రాలు కలిగిన రాజ్యాలు అంటారు. మిగిలిన దేశాలను నాన్ న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అనగా అణ్వస్త్రాలు లేని రాజ్యాలుగా పరిగణిస్తారు. మిగతా దేశాలు ఏవైనా 1967 తర్వాత అణ్వస్త్రాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఆ దేశాలను ఈ ఒప్పందం అణ్వస్త్రాలు ఉన్న దేశాలుగా గుర్తించదు. భారత్, పాకిస్థాన్ లాంటి దేశాలు ఈ కోవకే వస్తాయి. ఇదో రకమైన న్యూక్లియర్ ఫ్యూడలిజం. న్యూక్లియర్ వెపన్ స్టేట్స్ అన్న గుర్తింపు పొందిన దేశాలు ఐదు మాత్రమే. అవి అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా. విచిత్రం ఏమంటే ఈ ఐదు దేశాలు ఐరాసలోని అతి కీలకమైన భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలే. ఎందుకు విచిత్రమో కొద్దిసేపు తర్వాత వివరిస్తాను. 1967 తర్వాత అణు విస్ఫోటనం చేసిన దేశాలను అణ్వస్త్ర దేశాలుగా ఈ ఎన్‌పీటీ ఒప్పందం గుర్తించదు. అణ్వస్త్రాలకు సంబంధించి అత్యంత కీలకమైన ఒడంబడిక పత్రం ఇది. ఈ ఒప్పందానికి దాదాపు 200 దేశాలు సంతకాలు చేశాయి. అంటే ఒప్పంద నియమాలను పాటించటానికి అంగీకరించాయి. 1970 తర్వాత అణు విస్ఫోటనం చేసి అణ్వాయుధాలు తయారు చేసినట్టు గుర్తింపు పొందిన దేశాలు కొన్ని ఉన్నాయి. అటువంటి దేశాల్లో భారత్, పాకిస్థాన్ ముఖ్యమైనవి. భారత్ పాకిస్థాన్ ఎన్‌పీటీ ఒప్పందాన్ని వ్యతిరేకించాయి. ఎందుకంటే 1970 తర్వాత విస్ఫోటనం చేసిన దేశాలను అణ్వస్త్ర దేశాలుగా ఈ ఒప్పందం గుర్తించదు. అలా గుర్తింపు పొందిన ఐదు దేశాలకు ఉండే సదుపాయాలు, మినహాయింపులు ఈ దేశాలకు ఉండవు. అందుకే ఎన్‌పీటీ వివక్షతో కూడుకున్న ఒప్పంద పత్రం అని ముఖ్యంగా భారత్ వాదన. ఎన్‌పీటీ ఒప్పందం మీద సంతకం చెయ్యటమంటే మనకున్న అణ్వస్త్రాలను నిర్వీర్యం చేసి మన ఆయుధాగారాలను అంతర్జాతీయ పరిశీలనకు తెరిచి



ఉంచాలి. ఈ నిబంధన అణ్వస్త్ర దేశాలుగా గుర్తింపు పొందిన ఐదు దేశాలకు వర్తించదు. 1967కి ముందు విస్ఫోటనం చేసిన దానికి ఉన్న పవిత్రత ఏమిటీ, ఆ తర్వాత విస్ఫోటనం జరిపిన దేశాలు చేసిన పాపం ఏమిటనేది ఈ ఒడంబడికకు ఉన్న ముఖ్యమైన బలహీనత. కడుపునిండా చద్దన్నం తిన్న అమ్మకు ఇతరుల ఆకలి ఏమి తెలుస్తుందన్న సామెత గుర్తుకు వస్తుంది ఈ ఒడంబడిక పదజాలం చూస్తుంటే. అణ్వస్త్రాలు కలిగిన ఐదు దేశాలను ఇంతకుముందు విచిత్రం అనుకున్నాం కదా. ఎందుకు విచిత్రం అంటే భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు ఐరాస ఆశయాల సాధనలో ముఖ్య భూమిక పోషించాలి. ఏమిటి ఆ ముఖ్య భూమిక అంటే? సభ్యదేశాల మధ్య యుద్ధాలను నిరోధించటం, శాంతిని స్థాపించటం. కోల్డ్‌వార్ యుగంలో నాటో అన్న పేరుతో అమెరికా ఒకవైపు, వార్సా ప్యాక్ట్ అన్న పేరుతో అలనాటి సోవియెట్ యూనియన్ మరోవైపు ప్రపంచాన్ని అల్లకల్లోలానికి గురిచేశాయి. తద్వారా అనేక దేశాలు ఆయుధాలు ఏర్పాటు చేసుకునే పోటీ వాతావరణానికి శ్రీకారం చుట్టాయి. దెయ్యాలు వేదాలు వల్లించటం అంటే ఇదే కదా! ఎన్‌పీటీలో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. అవి: ఆయుధాల వ్యాప్తిని అరికట్టడం, నిరాయుధీకరణ, అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకోవటం. ఒడంబడికలో ఉన్న ఆశయాలేవీ నెరవేరలేదు 55 ఏండ్ల తర్వాత కూడా. అంటే మన దేశంలో వరకట్న నిరోధక చట్టం లాంటిది ఈ ఎన్‌పీటీ ఒడంబడిక! భారత్, పాకిస్థాన్ ఈ ఒడంబడికను అంగీకరించలేదు గనుక ఇందులోని నిబంధనలు ఈ దేశాలకు వర్తించవు. అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించవలసినది ఏమంటే అణ్వస్త్రాలు భద్రత కోసం కన్నా కూడా భయం కలిగించటానికి ఏర్పాటు చేసుకోవటమనే విషయం. నా వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయి. నా జోలికి వచ్చావంటే జాగ్రత్త అనేది ఇక్కడ సూత్రం. అంటే, ఇవి నాకు బలాన్నివ్వవు. కానీ, నేనంటే భయాన్ని కొల్పుతాయన్నమాట. మరి రెండు పొరుగు దేశాలైన భారత్-పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నప్పుడు ఒకరిని చూసి మరొకరు జాగ్రత్తగా ఉండాలి కదా! కానీ, పాకిస్థాన్ పసి పిల్లాడి మాదిరిగా మా దగ్గర అణ్వాయుధాలు ఉన్నవని అదేపనిగా అరవటం దేనికి సంకేతం? మేము ఆ ఆయుధాలను వాడటానికి వెనకాడమని చెప్పటమే కదా! మరి భారత్ వద్ద కూడా ఉన్నవి కదా! పాకిస్థాన్ కంటే భారత్ వద్దే ఎక్కువ ఉంటాయి కదా అణ్వాయుధాలు. మరి భారత్‌ను బెదిరించటం ఏమిటి? ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమంటే భారత్ ఎప్పుడూ అణ్వస్త్రాల ప్రస్తావన తీసుకురాదు. అందరూ అంగీకరించే విషయాన్ని నిరూపించవలసిన అవసరం ఏమున్నది? ఇక్కడ అణ్వాయుధాల పట్ల భారత్ వైఖరిని గురించి తెలుసుకోవాలి. ఈ విషయంలో భారత్ ఒక స్వీయ నియంత్రణ సిద్ధాంతాన్ని (న్యూక్లియర్ డాక్ట్రిన్) ఏర్పాటుచేసుకున్నది. అందులోని ముఖ్యమైన అంశం నాన్ ఫస్ట్ యూజ్. అంటే, మొదటగా మేము అణ్వస్త్రాలను యుద్ధంలో ప్రయోగించబోమనేది భారత్ విధానం. ఎవరైనా మా మీద ప్రయోగిస్తే తిరిగి మా అణ్వాయుధాలను ప్రయోగించటానికి వెనుకాడం. కానీ, మేము మాత్రం మొదటగా ప్రయోగించబోమనేది మొదటి సూత్రం. రెండవది అణ్వస్త్రాలు లేని దేశం మీద అణ్వస్త్రాలను ప్రయోగించం అనేది. ఇంతకు మించిన స్వీయ నియంత్రణ ఏముంటుంది? ఇది అత్యంత బాధ్యతాయుతమైన అణు ప్రవర్తన అనటంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. మన అణ్వస్త్ర ధర్మాన్ని రూపొందించింది కె.సుబ్రహ్మణ్యన్ అనే అణ్వస్త్ర వ్యూహకర్త. ఆయన కుమారుడే నేటి మన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్! ఒక్క మాటలో చెప్పాలంటే ఏ దేశానికైనా అణ్వాయుధాలు ఇతరులు మనజోలికి రాకుండా భయపెట్టే సాధనమే గానీ మనకు భద్రత కల్పించే వ్యవస్థ కాదు. దీన్నే దౌత్య భాషలో డిటరెన్స్ అంటారు. అంటే మనకు ఉత్సాహాన్ని పెంచేదానికన్నా ఇతరులను నిరుత్సాహపరచటం అన్న మాట. కానీ, పాకిస్థాన్ ఈ డిటరెన్స్ అన్న మాటను అర్థం చేసుకోకుండా కోతికి కొబ్బరికాయ దొరికినట్టు, పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టు మాటిమాటికీ భారత్‌ను అణ్వస్త్రాలతో బెదిరించటం హాస్యాస్పదంగా ఉన్నది. భారత్ దగ్గర ఉన్న అణ్వాయుధాలు దీపావళి పండుగ చేసుకోవటానికి కాదు గదా! ఇక్కడ వాస్తవం ఏమంటే అణ్వస్త్రాలు ఎవరు ముందువాడినా, ఎవరు తర్వాత వాడినా, ఎవరూ మిగిలి ఉండరు. అణ్వస్త్రాలు 1945లో మొదటిసారి జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి మీద ప్రయోగించినప్పుడు, అవి చాలా పరిమిత శక్తి కలిగిన ఆటంబాంబులు. 1945లో వాడిన 'చిన్న బాలుడు', 'దొడ్డ మనిషి' అన్న పేర్లు ఉన్న ఆటం బాంబుల విధ్వంసం హిరోషిమా నాగసాకి నగరాలు వాటి చుట్టుపక్కల ప్రాంతాలకు పరిమితమైనది. కానీ, 1945 తర్వాతి కాలంలో అణ్వస్త్రాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినది. నేటి అణ్వస్త్రాలు'చిన్న బాలుడు, దొడ్డ మనిషి' కన్నా చాలా శక్తివంతమైన ఆయుధాలు. ఈ ఆయుధాలను ప్రయోగిస్తే గెలిచేవారుండరు. ఇరువైపులా ఊహించలేనంత వినాశనమే. మ్యూచువల్లి అష్యూర్డ్ డిస్ట్రక్షన్ (%హీూణ%) అంటారు న్యూక్లియర్ పరిభాషలో. అంతటి వినాశన శక్తి కలిగిన ఆయుధాలు మావద్ద ఉన్నవని పాకిస్థాన్ అదే పనిగా అరవటం తాటాకు చప్పుడా లేక తెగింపునకు నిదర్శనమా? ఇటువంటి బాధ్యతా రాహిత్య ప్రవర్తనను ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలి. ఈ విషయం మీద నెలకొన్న నిశ్శబ్దాన్ని చూస్తుంటే ముక్తకంఠంతో పాకిస్థాన్‌ను ఖండించటానికి ప్రపంచం సిద్ధమా? అనేది సందేహమే. అది నిజంగా ప్రపంచం మొత్తానికి పట్టిన దురదృష్టం. ఏ దేశానికైనా అణ్వాయుధాలు ఇతరులు మన జోలికి రాకుండా భయపెట్టే సాధనమే గానీ మనకు భద్రత కల్పించే వ్యవస్థ కాదు. దీన్నే దౌత్య భాషలో డిటరెన్స్ అంటారు. అంటే మనకు ఉత్సాహాన్ని పెంచేదానికన్నా ఇతరులను నిరుత్సాహపరచటం అన్న మాట. కానీ, పాకిస్థాన్ ఈ మాటను అర్థం చేసుకోకుండా పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టు మాటిమాటికీ భారత్‌ను అణ్వస్త్రాలతో బెదిరించటం హాస్యాస్పదం.

# మళ్లీ చైనా 'నామకరణోత్సవం'

కయ్యానికి కాలుదువ్వటం, గిల్లికజ్జాలకు దిగటం చైనాకు అలవాటైన విద్య. అందులో భాగంగానే మన అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతాలకు మాండరిన్ పేర్లు తగిలించి మళ్లీ పేచీకి దిగింది. తమ దేశంలో పేర్లు మార్చుకుంటే అది అంతర్గత వ్యవహారమవుతుంది. దాని వెనక ఏ సెంటిమెంటువున్నదో బయటివారికి అనవసరం. కానీ పొరుగు ప్రాంతాలకు కొత్త పేర్లు ఆలోచించే భారాన్ని ఎందుకు నెత్తినేసుకున్నట్టు? ఏదైనా ప్రాంతాన్ని సొంతం చేసుకునేముందు ఆ ప్రాంతానికి తమదైన పేరు తగిలిస్తే సరిపోతుందని చైనా నేతలు భావిస్తున్నట్టున్నారు. సంబంధాలు మెరుగుపడతాయనుకున్న ప్రతిసారీ కొత్త పేచీకి దిగటం చైనాకు రివాజైంది. 2020లో గల్వాన్ లోయలో అకారణంగా ఘర్షణ లకు దిగి మన జవాన్లు 20మందిని బలితీసుకుంది. తాను కూడా మన జవాన్ల చేతుల్లో భారీ నష్టం చవిచూసింది. చర్చోపచర్చల తర్వాత ఇప్పుడిప్పుడే సంబంధాలు మెరుగవుతు న్నాయి. మానస సరోవర యాత్రకు మన యాత్రికులను అనుమతిస్తామని నాలుగేళ్ల తర్వాత ఇటీ వలే చైనా ప్రకటించింది. ఈలోగానే హఠాత్తుగా ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చింది. అరుణాచల్‌పై ఏదోరకంగా ఆధిప త్యాన్ని చాటుకునే ప్రయత్నం చేయటం, దాన్ని 'వివాదాస్పద ప్రాంతం'గా అభివర్ణించటం చైనా ఎప్పుడూ మానుకోలేదు. ఇరు దేశాల మధ్యా సుహృద్భావ సంబంధాలు ఏర్పడి అయిదు దశాబ్దాల వుతోంది. శిఖరాగ్ర సమావేశాలు జరగటం, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదరటం, ఇరువైపులా పౌరులు రాకపోకలు సాగించటం వంటివన్నీ కొనసాగుతున్నాయి. కానీ మన అధినేతలెవరైనా అరుణాచల్ వెళ్లినప్పుడల్లా మతిభ్రమించినట్టు గొడవకు దిగటం అలవాటైంది. గగనతలాన్ని అతిక్రమించి అరుణాచల్‌లోకి చైనా యుద్ధ విమానాలు చొచ్చుకురావటం కూడా షరా మామూలే. ఈ చిత్ర విచిత్ర విన్యాసాల్లో భాగమే అరుణాచల్‌లోని ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టడం. మొదటగా 2017లో దీన్ని ప్రారంభించింది. అటు తర్వాత 2021నుంచి వరసగా ఇదే పని చేస్తోంది. మళ్లీ తాజాగా మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించింది. 2017లో మొత్తం ఆరు ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టింది. ఇంచుమించు ఆ రాష్ట్రం నలుదిక్కులావున్న ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. 2021లో 15 జనావాస ప్రాంతాలూ, నాలుగు పర్వతాలూ, రెండు నదులూ, ఒక పర్వతప్రాంత మార్గమూ ఎంపిక చేసుకుని మాండరిన్ పేర్లు పెట్టింది. 2023లో 11, ఆ మరుసటేడాది 30 ప్రాంతాలు ఎంపిక చేసుకుని పేర్లు మార్చింది. తాజాగా 27 ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టింది. ఇందులో రెండు భూభాగాలూ, రెండు జనావాస ప్రాంతాలూ, అయిదు పర్వత శిఖరాలూ, రెండు నదులతోసహా అనేకం ఉన్నాయి. ఈసారి అదనపు విశేషం ఏమంటే... వీటిని పాలనాపరమైన సబ్ డివిజన్లుగా విభజించి ఏవి ఏ పరిధిలోకొస్తాయో ఏకరువు పెట్టింది. పైకి చూడటానికి ఇదంతా తెలివితక్కువతనంగా, పనికిమాలిన చర్యగా అనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో ఆ ప్రాంతాలు తనవేనని దబాయించటానికే ఇంత శ్రమ తీసుకుంటున్నదని వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులంటారు. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో దీవులకు కూడా ముందు ఈ మాదిరిగానే పేర్లు తగిలించి, అటుతర్వాత అవి ఎప్పటినుంచో తమవని పేచీకి దిగింది. జపాన్‌తోనూ సెంకాకు దీవుల విషయంలో ఇదే మాదిరిగా గొడవ ప్రారంభించింది. అరుణాచల్‌లో దాదాపు 90,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని తనదిగా చెప్పుకోవటం చైనాకు ఎప్పటినుంచో అలవాటు. మన దేశం బ్రిటిష్ వలసపాలకుల ఏలుబడిలోవుండగా 1914లో సిమ్లాలో భారత్, టిబెట్‌ల మధ్య సరిహద్దు ఒప్పందం కుదిరింది. దాని ఆధారంగా ఉనికిలోకొచ్చిన మెక్‌మెహన్ రేఖ రెండు ప్రాంతాలనూ విభజిస్తుంది. ఆ సమయంలో చర్చల్లో పాల్గొన్న చైనా ప్రతినిధి ఇందుకు ఆమోదం తెలిపేందుకు నిరాకరించాడు. అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చు కునే స్వాతంత్ర్యం టిబెట్‌కు లేదని వాదించాడు. 1949లో అక్కడ కమ్యూనిస్టులు అధికారంలోకొచ్చాక వారు కూడా ఈ వాదననే తలకెత్తుకున్నారు. చారిత్రకంగా అరుణాచల్... టిబెట్‌లో అంతర్భాగమని చెబుతూ అందుకు తవాంగ్, లాసాల్లోని బౌద్ధారామాల మధ్య ఉన్న సంబంధాలను ఏకరువు పెడుతోంది. అరుణాచల్‌ను దక్షిణ టిబెట్‌గా భావిస్తూ తనదైన మాండరిన్‌లో జంగ్నాన్ అనటం, అక్కడివారికి విడి వీసాలు జారీచేయటం కూడా పాత ధోరణే. ఒకపక్క వాస్తవాధీనరేఖ వద్ద అయిదేళ్ల క్రితం జరిగిన ఘర్షణలపై చర్చలు సాగుతూ, ఇప్పుడి ప్పుడే సాధారణ పరిస్థితులు ఏర్పడుతుండగా మళ్లీ పేర్ల జోలికి పోవటంలో మతలబువుంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చైనా అందించిన ఆయుధ సామగ్రి సంగతి వెల్లడైంది.

# మానసిక దివ్యాంగులు తయారు చేసే హస్తకళలు, అలంకరణ వస్తువులను విస్తృత ప్రచారం కల్పించాలి






**క్రాఫ్ట్ జన్ స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయం..**
**మానసిక దివ్యాంగుల శిక్షణ పాఠశాలల అధినేతలు, నాబార్డ్ అధికారులు**

**ఉప్పల్,మే17(సూర్యరేఖ)** క్రాఫ్ట్ జన్ ఫౌండేషన్ నాబార్డ్ సౌజన్యంతో మానసిక దివ్యాంగులైన పెద్దలకు వివిధ చేతితో తయారు చేసే హస్తకళలు ఇతర అలంకారాన వస్తువుల తయారీ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం గత మూడు రోజులుగా రామంతాపూర్ లోని సెయింట్ జాన్స్ సెమినరీలో ముగిసింది.ఈ శిక్షణ తరగతులను పరిశీలించిన మానసిక దివ్యాంగుల శిక్షణ పాఠశాలల అధినేతలు, నాబార్డ్ అధికారులు మాట్లాడుతూ...మానసిక దివ్యాంగులు తయారు చేసిన వివిధ రకాల హస్తకళలు,అలంకరణ వస్తువులను విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్పొరేట్ స్థాయిలో విక్రయాలు కల్పించి మానసిక దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తూ ఉన్న క్రాఫ్ట్ జన్ సేవలు ప్రశంసనీయమని కొని యాడారు. హస్తకళలతో పాటు ఉపాధి కల్పించే ఎంపిక చేసిన కొన్ని వృత్తి విద్యల్లో కూడా మానసిక దివ్యాంగులకు శిక్షణ ఇవ్వడానికి క్రాఫ్ట్ జన్ సంస్థ కృషి చేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా మేనేజర్ హర్ష రఘురాం తో పాటు మానసిక దివ్యాంగులకు శిక్షణ ఇచ్చే వివిధ విద్యాసంస్థల అధిపతులు పి.మ ధుసూదన్ రెడ్డి, శ్రీదేవి ప్రసాద్,దాసరపల్లి జోషి, ప్రీతి సీమధనుంజయ్, రాజేష్ మరియా డాక్టర్ వీరు రాజు,అశోక్ మేఘరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బండారి రాజిరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ నేత గడ్డం రవికుమార్





**ఉప్పల్,మే17 (సూర్యరేఖ)** ప్రముఖ కాంగ్రెస్ నాయకులు,ఉప్పల్ నియోజకవర్గం తొలి మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభ రామంతపూర్ గాంధీనగర్ చౌరస్తాలో అన్ని పార్టీలకు అతీతంగా జరిగింది.సంతాప సభలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రవికుమార్ మాజీ జాతీయ కో-ఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్ ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సుర్వి మురళి గౌడ్, కాంగ్రెస్ నాయకులు జలీల్ పాషా,శ్రీనివాస్ యాదవ్, బోసాని పవన్ కుమార్,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బండారి రాజిరెడ్డికి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...తన సోదరుడు బండారి రాజిరెడ్డి ఆశయ సాధన కోసం పాటుపడతానని పేర్కొన్నారు.ఆయన చూపిన మార్గంలోనే నడుస్తూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తానని వెల్లడించారు.

# భక్త మార్కండేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు హాజరైన పరమేశ్వర్ రెడ్డి







**ఉప్పల్,మే17(సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్ లక్ష్మీనారాయణ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి రామలింగేశ్వర సహిత సాయిబాబా దేవస్థానంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి విగ్రహ స్థిర ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది.శనివారం జరిగిన స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ,కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో లక్ష్మీనారాయణకాలనీ అద్యక్షులు లుకాస్,కాలనీ పెద్దలూ వెంకట్ రెడ్డి,నాగేశ్వర్ రావు,ఆలయ కమిటీ అధ్యక్షులు నామని నాగరాజు, గౌరవ అధ్యక్షులు పొన్న యాదగిరి,ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం ఉపాధ్యక్షులు దూబ కృష్ణ, కోశాధికారి పోచం వేణు,ఆకారపు అరుణ్ ఉపేందర్ రెడ్డి,సత్తిరెడ్డి సందీప్ భాస్కర్ బ్రహ్మచారి శ్రీధర్, ప్రసాద్,పల్లె రవిప్రసాద్ దుర్గాప్రసాద్ రాజ్యగుప్తా, రామ్ బ్రహ్మం శ్రీహరి సురేందర్ రెడ్డి మదర్ వలి, పూర్ణచందర్ రెడ్డి కృష్ణ శ్రీను చారి లక్ష్మి పుష్ప ఉష ఝాన్సీ పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం..



**శివంపేట,మే17 (సూర్యరేఖ)** శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో ఐదు రోజుల క్రితం వడ్డే శేఖర్ చిన్న వయసులో అకస్మాత్తుగా మరణించారు.వారి ఆత్మ శాంతించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆ భగవంతున్ని ప్రార్థించారు.అదేవిధంగా తాజా మాజీ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా రూ.5 వేలు వారి కుటుంబానికి అందజేశారు.బీఆర్ఎస్ పార్టీ దొంతి గ్రామ అధ్యక్షుడు సోమగారి అనిత మరణించిన వడ్డే శేఖర్ దశదిన కార్యక్రమానికి 50 కేజీల బియ్యం అందజేశారు.వారికి దొంతి బీఆర్ఎస్ పార్టీ తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ దొంతి గ్రామ మహిళా అధ్యక్షురాలు సోమగారి అనిత,మాజీ ఎంపీటీసీ కోదాస్ కుమార్,గ్రామ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ చిగుల్లపల్లి శ్రీనివాస్ గుప్త,బొడ్డు సుధాకర్,గంగం నరేందర్, కొత్త శ్రీను,రాచ మల్ల మహేష్,దుండిగళ్ళ బిక్షపతి,మంగలి శ్రీనివాస్, తుడుము రాములు,చాకలి దశరథ,వరిగే కాంతం,బేగరి ముత్యాలు,గుర్రం శ్రీకాంత్ రెడ్డి,కోదాస్ నరసింహులు, పిట్ల కృష్ణ పాల్గొనడం జరిగింది.

## నల్ల కనెక్షన్ కు మోటార్ పెడితే కేసులు నమోదు చేస్తాం..

**జలమండలి డిజిఎం జోహార్**



**రాజేంద్రనగర్,మే17సూర్యరేఖ)** మంచినీటి వినియోగదారులు తమ కనెక్షన్ కు మోటారు బిగించి నీటిని తోడితే కేసు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ బుద్వేల్ సబ్ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ హెచ్చరించారు.శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ నలందనగర్ లో ఓ ఇంట్లో నల్ల కనెక్షన్ కు బిగించిన మోటర్ ను తనిఖీలో పట్టుకున్నారు.నల్ల కనెక్షన్ కు మోటర్ పెట్టడం వల్ల పరిసర ప్రాంతాల వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సూచించారు. జలమండలి ఎండి అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా తనిఖీలు చేస్తున్నమన్నారు.తనిఖీల్లో జెడ్ఐ జావిద్, పంప్ ఆపరేటర్లు అఖిలేష్,వెంకటేశులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బి.శ్రీనివాస్ గౌడ్ కి గురుపీఠం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆహ్వాన పత్రిక..



**శివంపేట,మే17 (సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని గూడూరులోని గ్రామంలో జరిగే గురు పీఠంలోని విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీగురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ తరపున ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్,శ్రీగురు పీఠం ట్రస్ట్ సభ్యులు,బీఆర్ఎస్ శివంపేట మండలాధ్యక్షులు రాజా రమణగౌడ్,లు శ్రీదత్తాత్రేయ స్వామి, శ్రీషిరిడి సాయిబాబా దివ్యమూర్తుల ప్రాణ ప్రతిష్ట పూజ ముహూర్తానికి జూన్ 5వ తేదీన రావాల్సిందిగా కోరారు.శ్రీనివాస్ గౌడ్ స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని తెలిపారు.

## నియోజకవర్గంలో కొమిరెడ్డి దంపతుల కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి

**జగిత్యాల :** తెలంగాణ రాష్ట్రంలో అరుదైన దంపతులు కొమిరెడ్డి దంపతులు అని కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పోరాటం చేసిన ఆ పుణ్య దంపతుల కాంస్య విగ్రహాలను కోరుట్ల నియోజకవర్గంలో తేదీ 8 9 2025 రోజున నిర్వహించే కొమిరెడ్డి జ్యోతక్క వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేయాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యతతో ఇట్టి పుణ్య దంపతుల కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఇది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు ఇట్టి విగ్రహాల ఏర్పాటుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి సముచితమైన స్థలం చూడాలని విగ్రహాల తయారీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభించే విధంగా అట్టి కమిటీ బాధ్యతలు తీసుకోవాలని సిఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు కోరారు ఇది కేవలం తన వ్యక్తిగత విషయం కాదని నియోజకవర్గ ప్రజల కోరిక అని అనునిత్యం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడిన మహనీయులు కావున వారి విగ్రహాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజల కోరిక మేరకే తన అభిప్రాయాన్ని వ్యక్తపరచానన్నారు

# ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు





**ఉప్పల్,మే17( సూర్యరేఖ)** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉప్పల్ బిజెపి అధ్యక్షులు మార్నేని ఫణీంద్ర నేతృత్వంలో డివిజన్ బిజెపి నాయకులు సందర్శించారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్య రాణిని కలిసి హెల్త్ సెంటర్ లోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ...ఉప్పల్ డివిజన్ జనాభా సుమారు 85000 పైచిలుకు ఉంటుందని,ఇంత జనాభా గల ఉప్పల్ కు ప్రైమరీ హెల్త్ సెంటర్ సరిపోదని అన్నారు.కేవలం 20 వేల జనాభాకు మాత్రమే సరిపోతుందని పేర్కొన్నారు. బస్తీ దవాఖానాలు ఏమాత్రం సౌకర్యాలు లేవని పేరుకి మాత్రమే నడుస్తున్నాయన్నారు.బస్తీ దవాఖానాలు నిరంతర సేవలు అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు.నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ స్కీమ్ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఆచరణలో ఇంకా పెట్టలేదన్నారు.ఉప్పల్ డివిజన్లో ఖచ్చితంగా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి అవసరం ఉందని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్,లను కలుస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు షామీర్పేట్ ధర్మారెడ్డి,తీగ విఠల్ రావు ముదిరాజ్,శ్రీధర్ గుప్తా,పంజాల శ్రవణ్ గౌడ్ దువ్వాళ రమేష్,తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,ఫకీర్ నర్సిరెడ్డి,అడపు రమేష్,నామ శ్రవణ్,ఆకుల రిషికేష్, స్వామిగౌడ్,అనిల్ కుమార్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన మెట్రో ఛార్జీలు రద్దు చేయాలి







మెట్రో కార్యాలయం వద్ద ధర్నాలో వామపక్ష పార్టీలు

**ఉప్పల్,మే17 (సూర్యరేఖ)** పెంచిన మెట్రో ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు శనివారం ఉప్పల్ లోని మెట్రో ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేశారు. సిపిఎం,సిపిఐ (ఎమ్ఎల్) న్యూడెమోక్రసీ, ఎస్.యు.సి.ఐ,ఎంసిపిఐ,లు సంయుక్తంగా ఈ ధర్నా నిర్వహించారు.పెంచిన మెట్రో ఛార్జీలు రద్దు చేయాలని,మెట్రో నష్టాలకి యాజమాన్యమే కారణమని,నష్టాలు పుచ్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని,చార్జీల పెంపుని రద్దు చేసేందుకు కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని కార్యకర్తలు పెద్ద ఎత్తున నినదించారు.ధర్నా అనంతరం ఎల్ అండ్ టి యాజమాన్యానికి వామపక్ష పార్టీల తరపున వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి ఎం వెంకటేష్, సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ...ఎలాంటి ఎల్ అండ్ టి యాజమాన్యం మెట్రో ఛార్జీలు పెంచడం సరైనది కాదని,వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ అండ్ టి యాజమాన్యం ప్రభుత్వంతో జరిగిన ఒప్పందానికి భిన్నంగా ఇప్పటికే చార్జీలు పెంచి ప్రయాణికుల నుండి అదనంగా వసూలు చేస్తున్నారని,తిరిగి ఇప్పుడు చార్జీలు పెంచడం సరైనది కాదని తెలిపారు.ప్రభుత్వంతో ఎల్ అండ్ టి యాజమాన్యానికి జరిగిన ఒప్పందంలో రైల్వే నిర్వహణ ఖర్చు సగం ప్రయాణికుల నుండి మిగిలిన సగం రియల్ ఎస్టేట్,యాడ్స్ ఇతర రిటైల్ వ్యాపారాల ద్వారా సమకూర్చుకోవాలని కానీ దానికి భిన్నంగా చార్జీలు పెంచడం సరైనది కాదని చెప్పారు.ఫెయిర్ ఫిక్సేషన్ కమిటీ మెట్రో నష్టాల్లో ఉందని చార్జీలకు సిఫార్సు చేసిందని పెంచారు.మెట్రో నష్టాలకి ఎల్ అండ్ టి యాజమాన్యమే కారణం.రోజు ఐదు లక్షల మంది ప్రయాణికుల చార్జీల ద్వారా సంవత్సరానికి 650 కోట్లు వస్తుంటే యాడ్స్ ఇతర వనరుల ద్వారా 250 కోట్లు మాత్రమే మెట్రో ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన 269 ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోక,తమనష్టాలు తీర్చుకోవడానికి ఇతరు వనరులు పెంచుకోక ప్రయాణికులంపై భారాలు వేయడం సరైనది కాదని చెప్పారు.దేశంలోనే చార్జీలు ఎక్కువగా ఉన్న మెట్రో సర్వీస్ హైదరాబాద్,తిరిగి ఇప్పుడు పెంచడం ప్రజలపై మరింత భారం పడుతుందని తెలిపారు. ఎల్ అండ్ టి యాజమాన్యం ఏకపక్షంగా పెంచిందా.? లేదా దీనిలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పాత్ర ఉందా.? ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే ప్రయాణికులతో కలిపి భవిష్యత్తులో ప్రజా ఉద్యమాన్ని రూపకల్పన చేస్తామని తెలిపారు.సిపిఐ నాయకులు స్టాలిన్ మాట్లాడుతూ...నష్టాలు వస్తున్నాయని చార్జీలు పెంచడం సరైనది కాదని,మెట్రో యాజమాన్యం నష్టాలకు కారణమని ఇతర ప్రత్యామ్నాయలు ఆలోచించాలని డిమాండ్ చేశారు.సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు హన్మేష్ మాట్లాడుతూ...మెట్రో రైలు పర్యావరణానికి మేలు చేసేదని,ప్రజా రవాణాని లాభనష్టాలతో చూడకూడదని,అవసరం అయితే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.సిపిఐ ఎమ్ఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు ఝాన్సీ మాట్లాడుతూ... ఎల్ అండ్ టి యాజమాన్యం ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రజలనుంచి వసూలు చేస్తుందని,తిరిగి చార్జీల భారం పెంచడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ కార్యదర్శి ఎం.వెంకటేష్,మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఎం జిల్లాల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.వినోద, ఎం.శ్రీనివాస్ రావు,దశరథ్,జిల్లా కమిటీ సభ్యులు జె. వెంకన్న ఎం.నరేష్,ఆర్.సంతోష్,నాయకులు గణేష్, గౌస్ నాగరాజు,బిష్మాచారి,సిపిఐ హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్ యాదగిరి,శ్రీనివాస్ సీపీఎం ఎల్ మాస్ లైన్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. హన్మేష్ స్వరూప,ప్రదీప్,సీపీఎం ఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఝాన్సీ అనురాధ అరుణ అనసూయ ఎంసీపీఐ (యూ)జాతీయ కార్యదర్శి అనిల్ కుమార్, ఎస్ యుసిఐ (యు)నాయకులు తేజ సీపీఎం ఎల్ న్యూడెమోక్రసీ నాయకులు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన ప్రదర్శనలు..

**ఉప్పల్,మే17(సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం శ్రీచంద్రకళా నిలయం పేరిణి,ఆంధ్ర నాట్యం గురువు సంతోష్ పెరుమాండ్ల వారి శిష్య బృందంచే ప్రదర్శన చేశారు. శ్లోకం పుష్పాంజలి,దేవి కైవారం, నారాయణతే నమో,నమో,మూషిక వాహన,ఇదిగో భద్రాద్రి,తిల్లాన,మహా గణపతిమ్,కొండలలో నెలకొన్న,సంధ్య తాండవం,ముద్దుగారే యశోద, సాహిత్య పల్లవి దశావతరములు అంశాలను కృతిక రెడ్డి మనోజ్ఞ వైష్ణవి అక్షర,ప్రవస్తి,సంజన,హరిణి, మధుప్రియ రశ్మిత దీక్షిత్ అమృతవల్లి,నందిత, భువన గ్రీష్మశ్రీ అమూల్య సుహాని మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.




## మాజీమంత్రి తన్నీరు హరీష్ రావుకి గురుపీఠం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత..



**శివంపేట,మే 17(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని గూడూరులోని గురు పీఠం విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,ఆయన నివాసంలో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి, మాజీ అటవి శాఖ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు.శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్,ట్రస్టు సభ్యులు బీఆర్ఎస్ శివంపేట మండల అధ్యక్షులు రాజా రమణగౌడ్,మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్,మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ,గొర్రె వెంకట్ రెడ్డి,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్,రమాకాంత్ రెడ్డి,లను మాజీ ఉపాధ్యక్షులు జూన్ 5వ తేదీన జరిగే దత్తాత్రేయ మహా స్వామి,శ్రీషిరిడి సాయిబాబా ప్రాణ ప్రతిష్ట పూజ ఆహ్వాన పత్రికను అందజేశారు.ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి రావాల్సిందిగా హరీష్ రావుని ఆహ్వానించారు.హరీష్ రావు స్పందిస్తు తప్పకుండా వస్తామని చెప్పారు.

## ఘనంగా హనుమాన్ పడిపూజ మహోత్సవం..





**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండల పరిధిలోని నార్లపూర్ గ్రామంలో శనివారం మాజీ సర్పంచ్ అంబటి రామస్వామిగౌడ్, కుమారుడు కన్నె స్వామి శ్రీకాంత్ గౌడ్,స్వగృహంలో హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం చేపట్టారు.ఈ పడిపూజ కార్యక్రమంలో నార్లపూర్,ఖాజీపూర్,హైదరాబాద్, జక్కాపూర్,స్వాముల హాజరై అంజన్న భక్త సంకీర్తనలతో హనుమాన్ స్వాములు పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. అనంతరం హనుమాన్ స్వాములకు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.


## ఆలయానికి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే..



**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గౌడ సంఘ సభ్యులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావును కోరగా వెంటనే స్పందించి ఆలయానికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగింది.దీంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జెల్లా లక్ష్మణగౌడ్,దుబ్బ రాజాగౌడ్ అంజాగౌడ్,అశోక్ గౌడ్,బాలరాజ్ గౌడ్,తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల వ్యాపార అభివృద్ధి కోసం విద్యార్థుల ఫోటోలతో బోర్డులు,ఫ్లెక్సీలు






**మున్సిపల్ శాఖ,విద్యాశాఖ అధికారుల చర్యలు శూన్యం..**

**మెహిదీపట్నం,మే 17 (సూర్యరేఖ)** గోల్కొండ, ఆసిఫ్ నగర్ మండలాల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తొత్తులుగా మారి నిమ్మకు నిరేతినట్టు వ్యవహారిస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తి చేశారు. 10వ తరగతి పాసైన తమ పిల్లల ఫోటోలను ప్రైవేట్ పాఠశాలలు తమ విద్యా వ్యాపారం అభివృద్ధి కోసం ప్రచారంకై ఇష్టానుసారంగా నో పార్కింగ్ బోడులపై,ఫ్లెక్సీలల్లో తమ పిల్లల ఫోటోలు వేసి ఇష్టానుసారంగా ముఖ్య కూడళ్ళలో వాటిని ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల పై ఏ ఫిర్యాదు అందినా తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే అధికారులు ఫిర్యాదు కాపిలను ఆయా పాఠశాల యాజమాన్యలకు చూపి పబ్బం గడుపుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. గోల్కొండ,ఆసిఫ్ నగర్ మండలాల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు తూట్లు పోడుస్తున్న చర్యలు శూన్యం మని,ఇకనైనా అలాంటి నిబంధనలకు తూట్లు పోడుస్తున్నప్రైవేట్ పాఠశాలలపై చర్యలు చేప ట్టాలని,పిల్లల ఫోటోలను బోర్డులపై,ఫ్లెక్సీలల్లో వేసి రోడ్లపై అడ్డగోలుగా పెట్టిన ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ మున్సిపల్ శాఖ,విద్యాశాఖ అధికారులు చార్యులు తీసుకోవాలి కోరుతున్నారు.

## రామంతపూర్ రజక సేవా సంఘం భవనం మొదటి అంతస్తు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు






**ఉప్పల్,మే17(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్లోని ఆనందనగర్ లో రామంతపూర్ రజక సేవా సంఘం ధోబి ఘాట్ దగ్గర సంఘం భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ. 32 లక్షలను రామంతపూర్ కార్పోరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు మంజూరు చేయించారు. శనివారం మొదటి అంతస్తు పనులను కార్పోరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు మాట్లాడుతూ. రామంతపూర్ రజక సంఘం వారి అవసరాలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కు రజక సంఘం ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్ రామంతపూర్ రజక సంఘం అధ్యక్షులు బొడ్డు పల్లి దానయ్య,బోసాని పవన్, జిత్తు,శంభు లింగం,బొడ్డుపల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.

# నాచారంలో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి ఘన నివాళి





**రాజకీయ గురువైన రాజిరెడ్డిని తలుచుకుంటూ కన్నీటి పర్యంతమైన సాయి జన్ శేఖర్**

**ఉప్పల్,మే17 (సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్ ఆధ్వర్యంలో ఉప్పల్ తొలి శాసనసభ్యులు కీర్తిశేషులు బండారి రాజిరెడ్డికి నాచారంలోని ఏఎన్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో సంతాప సభ ఏర్పాటు చేయడం జరిగింది. రాజకీయంగా నాకు ఓనమాలు నేర్పింది బండారి రాజిరెడ్డి అంటూ సాయిజెన్ శేఖర్ కన్నీటి పర్యంతమయ్యారు. నిజాయితీకి నిలువుటద్దం బండారి రాజిరెడ్డి అంటూ రాజిరెడ్డిని గుర్తు చేసుకుంటూ వారిని స్మరించటం జరిగింది. సంతాప సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...బండారి రాజారెడ్డి చూపిన బాటలోనే నడుస్తూ నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నిజాయితీ గల పాలనా అందిస్తానని తెలియజేశారు. రాజకీయ నాయకులు ఎందరో పుడతారు పోతారు కానీ,రాజిరెడ్డి జననం ఒక చరిత్ర మరణం కూడా చరిత్రని అని పలువురు కొనియాడారు. రాష్ట్ర చరిత్రలోనే ఏ నాయకునికి ఇంత పెద్ద ఎత్తున సంతాప సభలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని,గత వారం రోజులుగా ప్రతిరోజు రెండు మూడు కాలనీలలో సంతాప సభలు ఏర్పాటు చేయడం రాజిరెడ్డికే దక్కిందన్నారు.

## శ్రీ తిరుమల స్వామి ఆలయంలో అభిషేక కార్యక్రమాలు..



**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెద గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ తిరుమల స్వామి ఆలయంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు వెంకట రామ్మోహన్ శర్మ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో ప్రతి శనివారం స్వామివారికి ధూప దీప నైవేద్యాలు అభిషేక కార్యక్రమాలతో పాటు సత్యనారాయణ స్వామి పూజలు చేపడుతామని, స్వామివారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్,దంపతులు,తదితరులు ఉన్నారు.

## నందిగామ బచ్చురాజుపల్లి డాంబార్ రోడ్డు గుంతల మయం..



**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండలం నందిగామ గ్రామం నుండి బచ్చురాజుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వేసి సంవత్సరాలు గడుస్తున్న తిరిగి డాంబర్ రోడ్డు పునః పనులు ప్రారంభించలేదని,ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. డాంబర్ రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారుల స్పందించి గుంతలు పూడ్చి వేసి డాంబర్ రోడ్డు పనులు ప్రారంభించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## వరి కొనుగోలు వేగవంతం చేయాలి..

**ఆర్ఐ ప్రీతి**



**నిజాంపేట,మే17(సూర్యరేఖ)**నిజాంపేట మండల పరిదిలోని నస్కల్, నందగోకుల్,చల్మెద గ్రామాలలో సొసైటీ,ఐకెపి,ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వద్ద కొనుగోలు కేంద్రాలను ఆర్ఐ ప్రీతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలన్నారు. అకాల వర్షాలకు టార్పోలిన్లు అందుబాటులో ఉంచుకొని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నిర్వాహకులు బురాని మంగ, బురాని వాణి,రైతులు అందె స్వామి, ఊడేపు రాజయ్య,కూడవెల్లి చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోను బాధితురాలికి అప్పగింత..




**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండల పరిధిలోని నార్లపూర్ గ్రామానికి చెందిన ఎక్కల సుజాత తన మొబైల్ ఫోన్ ను నెల రోజుల క్రితం పోగొట్టుకోవడం జరిగింది. బాధితురాలు వెంటనే నిజాంపేట పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేసుకోగా సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా ట్రాప్ చేసి శనివారం బాధితురాలి ఫోన్ అందించడం జరిగిందని ఇన్చార్జ్ ఎస్ఐ సృజన పేర్కొన్నారు. ఎవరైనా ఫోను పోగొట్టుకున్నట్లైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లయితే సీఈఐఆర్ సైట్ లో అప్లై చేసుకోవాలన్నారు. తద్వారా పోయిన ఫోనులో తిరిగి పొందవచ్చున్నారు.

# శ్రీఎల్లమ్మ తల్లి కళ్యాణానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే,కంఠారెడ్డి,లకు ఆహ్వానం





**నిజాంపేట,మే17(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ షష్టమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల18 నుండి 20 తారీకు వరకు కొనసాగు తాయని శ్రీరేణుక ఎల్లమ్మతల్లి జమదగ్ని మహర్షి, ల కళ్యాణానికి హాజరు కావాలని శనివారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, అలాగే బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి లకు గౌడ కులస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు జెల్లా లక్ష్మణ్ గౌడ్, దుబ్బ రాజాగౌడ్ అంజాగౌడ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్పగడ్డలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు





**ఉప్పల్,మే17(సూర్యరేఖ)** ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్యన బీరప్పగడ్డ నుండి కావేరినగర్ నాలా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మాట్లాడుతూ...ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని వ్యాపారులు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫుట్ పాత్ లు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారికి పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరికలు జారీ చేసిన వారిలో మార్పు రాలేదని పేర్కొన్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ గత పది రోజుల క్రితం పాదయాత్ర చేసి ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఫుట్ పాత్ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆక్రమణలు తొలగించుకుంటే వారికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసిపి విజయశ్రీ సూపర్వైజర్ సురేష్, సిబ్బంది రాజు,శ్రీనివాస్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

**అందాల పోటీల పేరుతో కోట్లాది రూపాయలు వృధా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**

**ఎలక్షన్ల ముందు ఇస్తానన్న కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇంటింటికి**

**మహిలల కు 2500 రూపాయల పెన్షన్లు మంజూరు చేయాలి**



**బెల్లంపల్లి,మే17(సూర్య రేఖ)** ఎంసిపిఐయు పార్టీ ఆఫీస్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి,ఎంసిపిఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దేనెక్కి 18 నెలలు గడిచినా కూడా ఎలక్షన్ల ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అందాలపోటీల పేరుతో కోట్లాది రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం వృధా చేస్తుందని,తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు అన్యాయం చేస్తుందని కళ్యాణ లక్ష్మి కింద రూ. 1.16 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇంతవరకు కూడా ఇవ్వకపోవడం చాలా సిగ్గుచేటని,అందాల పోటీల పేరిట 3270 తులాల బంగారాన్ని పక్క దేశంలో ఉంటున్న ఆడపడుచులకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా మహిళలకు ఇంటికి రూ. 2500 పెన్షన్ ఇస్తానని రేవంత్ సర్కార్ మాట తప్పిందని వాపోయారు. అదేవిధంగా చదువుకుంటున్న ప్రతి యువ మహిళకు స్కూటీ ఇస్తానని కూడా మాట తప్పారని,ఎలక్షన్ల ముందు ఏవైతే హామీలు ఇచ్చారో హామీలు అమలు చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్,తోగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


## దేవర శ్రీనివాస్ అద్వర్యంలో భారీగా తిరంగా ర్యాలీకి తరలిన నాయకులు..



**మెహిదీపట్నం,మే17(సూర్యరేఖ)** ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా తిరంగాయాత్ర నిర్వహిస్తున్నదని ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ట్యాంక్ బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం నుంచి సైనిక్ ట్యాంక్ వరకు నిర్వహించు ర్యాలీకి భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ అద్వర్యంలో రాజకీయాలకు అతీతంగ వివిధ పార్టీలకు చెంధిన నాయకులు,కార్యకర్తలతో గుడిమల్కపూర్ సర్కల్ నుండి విజయానికి గుర్తుగా,జాతీయ గౌరవానికి సంకేతంగా దేశం కోసం అనే నినాదంతో భారీ ర్యాలిగా తిరంగా ర్యాలీకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ..దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే దాడులు జరిపి100మందికి పైగా ఉగ్రవాదులను మట్టు బెట్టడం గర్వకారణ మన్నారు. ప్రపంచ దేశాలకు భరత దేశం సత్తా చూపరాని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ చారి, ప్రభు పూజారి వెంకటేష్ సాగర్,తధితరులు బయలు దేరారు.

## వదిలేసిన వాహనాలను గుర్తించి 6 నెలల్లోగా తీసుకెళ్లాలి..

జిల్లా ఎస్పీ



**కామారెడ్డి,మే17(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాలలో వదిలేసిన,పట్టుబడిన వాహనాలను చట్టపరమైన ప్రక్రియలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆద్వర్యంలో వేలం వేయడం జరుగుతుంది. ప్రస్తుతం 217 వాహనాలు (211 టూవీలర్లు,3 త్రీవీలర్లు,3 ఫోర్వీలర్లు) కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో భద్రపరచబడ్డాయి. వాహన యజమానులు తమ వాహనాన్ని గుర్తించి,సరైన ధ్రువపత్రాలతో పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఏ.నవీన్ కుమార్ (8712525970 / 8712686111) ను సంప్రదించి,ధ్రువపత్రాలను చూపించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. యజమానులు వాహనాన్ని తిరిగి పొందేందుకు 6 నెలల గడువు కలదు,గడువు పూర్తి అయిన తర్వాత, వాహనాలు వదిలివేయబడిన,క్లెయిమ్ చేయని తెలియని ఆస్తిగా పరిగణించబడి వేలం వేయడం జరుగుతుంది. వాహనాల పూర్తి వివరాలు కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పొందపరచబడ్డాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వాహన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీయం రాజేష్ చంద్ర సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పాకా జ్ఞానేశ్వరి



**కామారెడ్డి,మే17( సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి,రవి ప్రసాద్ పలు శుభకార్యాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బట్టు అవంతి శంకర్ కుమార్తె రిసెప్షన్ కు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# మన మేధా శక్తి ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసింది

తిరంగ యాత్రను విజయవంతం చేయాలి..
సైనికులకు మద్దతుగా తిరంగ ర్యాలీ..
రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్

**రాజేంద్రనగర్,మే17(సూర్యరేఖ)** తిరంగయాత్రను విజయవంతం చేసి పార్టీలకతీతంగా ఐకమత్యాన్ని చాటాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ అన్నారు.భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ అధ్యక్షతన రాజేంద్రనగర్ డివిజన్ మీటింగ్ పిఆర్ ప్యాలెస్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమం తిరంగయాత్ర ఛలో ట్యాంక్ బండ్,మంగళవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం నుంచి తిరంగా ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని తెలిపారు.రాజేంద్రనగర్ అసెంబ్లీ నుంచి పార్టీలకతీతంగా భజన మండలి సంఘాల నాయకులు,యువజన సంఘాల నాయకులు యోగ సెంటర్ మిత్రులు,దేవాలయ పూజరులు సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది మిత్రులు,అపార్ట్మెంట్ వాసులు మహిళలు విద్యార్థిని విద్యార్థులు



కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. దేశంలో భారతీయులంతా ఐక్యంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.మన మేధా శక్తి ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ ప్రభరి ప్రభాకర్ రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్,వాసు,హరికిషన్ జి సోల్కర్ రెడ్డి విట్టల్ కీర్తి శీను,మల్లేష్ చారి సప్నారెడ్డి,సరితా రెడ్డి రజినీకాంత్ గుప్తా,రాజశేఖర్ రెడ్డి,మహేష్ ముదిరాజ్,రవీందర్ రెడ్డి,విజయ్ యాదవ్ జయప్రకాష్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,లడ్డు,కరుణాకర్ రెడ్డి,చంద్ర గౌడ్,శశిధర్,నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**కామారెడ్డి,మే17(సూర్యరేఖ)**ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట్ మండల కేంద్రంలోని భయంపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ కండ్లపల్లి బాలయ్య,మాజీ ఎంపీటీసీ పచ్చింటి,సాయిలు,చింతల సాయిలు గుట్టమీద సాయిలు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి స్వాగతించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత 20 సంవత్సరాలుగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరగని అభివృద్ధి మదన్ మోహన్ గెలిచిన 16 నెలల్లో చేసి చూపించారని అన్నారు.గ్రామంలో ప్రభుత్వ పథకాలు,సీసీ రోడ్లు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.ప్రభుత్వ అధికారులు ప్రజల ఇంటికి వచ్చి సమస్యలు తీరుస్తున్నారన్నారు.ఈ అభివృద్ధికి ఆకర్షితులై ఎమ్మెల్యే మదన్ మోహన్,చేస్తున్న అభివృద్ధిలో భాగం అవ్వాలని కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో లింగంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న "సూర్యరేఖ" ప్రతినిధి





**శివంపేట.మే17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రానికి చెందిన "సూర్యరేఖ" ప్రతినిధి దొడ్లే సంతోష్ కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు పాడిపంటలతో ఆయు రారోగ్యాలతో,సుఖ సంతోషాలతో, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా దేవదేవుని ప్రార్థించడం జరిగింది.శివంపేట మండల దొడ్లే సంతోష్ తో పాటు వారి మిత్రులు ఇసుగారి మల్లేష్,సానే ఆనంద్ కుమార్,శ్రీవారి దర్శనం చేసుకోవడం జరిగింది.

## డైరెక్టర్ జనరల్ డిజీ షాన్వాజ్ ఖాసీంను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెసిడెంట్ టి.రాజు



**చేగుంట,మే17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట పట్టణ కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర కోశాధికారి,తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ మరియు మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షులు తోడుపునూరి రాజు,తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. శ్రీనివాస్, ఏఐఓసీడి మెంబెర్ పెండెం కృష్ణ కుమార్ లు ఔషధ నియంత్ర అధికారి కార్యాలయం,వెంగళరావునగర్ నందు డైరెక్టర్ జనరల్ డిజి షాన్వాజ్ ఖాసింను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.డీజీ షాన్వాస్ ఖాసీం మాట్లాడుతూ..హ్యాబిట్ ఫామింగ్ డ్రగ్స్ నిబంధన ప్రకారం అమ్మకాలు జరపాలని,నకిలీ మందుల శ్రద్ధ వహించాలని నిబంధనలు పాటించి కెమిస్ట్ లు సక్రమ మార్గంలో వ్యాపారం నడుపుకో వాలని,ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తెలంగాణ అసోసియేషన్ మాకు తెలిపినట్లైతే సమస్యల పరిష్కారం కొరకు సహకరిస్తానని తెలిపారు.

# తిరంగా ర్యాలీలో ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్

జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్



**ఉప్పల్,మే17(సూర్య రేఖ):** ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు,ప్రశంసలు తెలుపుతోంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా,మన ఐక్యత చాటడానికి శనివారం ట్యాంక్ బండ్ పై నిర్వహించిన తిరంగా ర్యాలీలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్, పాల్గొన్న మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, హన్మంత్ బిరాదర్,రాజిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అంతర్జాతీయ అందాల పోటీలను సందర్శించే అవకాశం లభించడంపై ఆనందం వ్యక్తం చేసిన విద్యార్థి



**బెల్లంపల్లి,మే17(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మే 10 నుండి 31 వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అందాల పోటీలో,తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా క్రీడలను వీక్షించే అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా షేక్‌పేట్ సీఓఈ లో చదువుతున్న బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రథమ్ పాండే మే 10న క్రీడలను వీక్షించాడు.తిరిగి అవకాశం లభించడంతో శనివారం క్రీడలను వీక్షించాడు.ఈ సందర్భంగా ప్రథమ్ పాండే అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు అర్జున్ అవార్డు గ్రహీత తేజస్ పడిగను కలిసి తమ అనుభవాలను వ్యక్త పరిచాడు.అంతర్జాతీయ క్రీడలను సందర్శించే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, కార్యదర్శి అలుగు వర్షిణికి,ప్రిన్సిపాల్ బాలస్వామికి,కళాశాల ఉపాధ్యాయుల కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడాకారున్ని సన్మానించిన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు...



**మణికొండ,మే17(సూర్యరేఖ)** బాల్ బ్యాడ్మింటన్ క్రీడ దినదినాభివృద్ధికి తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసిసోయేషన్ తరపున కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బంగారు స్వామి తెలిపారు.రీనీహ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సార్వత్రిక కార్యదర్శి వివి.రమణ,ఉపాధ్యక్షుడు డి.దుర్గయ్యల ఆధ్వర్యంలో ఎం.శ్రీనివాస్ రావును సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడకు చేసిన అమూల్యమైన సేవలను అందించి తరతరాలకు ప్రేరణగా ముందుకు కోనసాగించిన ఫెడరేషన్ ఇండియా ప్రధాన సలహాదారు,కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాల విజిలెన్స్,ఎన్ఫోర్స్మెంట్ విభాగం పోలీస్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ రావును సన్మానించినట్లు వివరించారు.బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారుడు బంగారు రాజయ్య తెలిపారు.

# అక్రమ రేషన్ దందాకు అడ్డాగా హాజీపూర్,లక్షటి పెట్ మండల కేంద్రాలు






**సివిల్ సప్లై,రెవెన్యూ,డిప్యూటీ కలెక్టర్ కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఆగని రేషన్ దందా**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,మే16(సూర్య రేఖ):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాలువైపులా రేషన్ బియ్యం దందా తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తూ ఉండేవారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఇంద్రవెల్లి,ఉట్నూర్,గుడిహత్నూర్ మండలాలలో రేషన్ బియ్యం దందా జోరుగా కొనసాగుతుండేది.ఎంతమంది సివిల్ సప్లై అధికారులు,జిల్లా పోలీస్ అధికారులు,రెవెన్యూ అధికారులు వచ్చిన ఆదిలాబాద్ జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందాను అడ్డుకోలేకపోయారు. ఎప్పుడైతే ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ టైగర్ అఖిల్ మహజాన్ ఆదిలాబాద్ కు వచ్చారో అప్పటినుండి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అక్రమ దందా వ్యాపారులు తమ వ్యాపారాన్ని ముగింపు పలికారు.అంటే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తమ కర్తవ్యం పట్ల నిజాయితీ అక్రమ వ్యాపారుల పట్ల కొరడా ఝులిపించి చట్టరీత్యాచర్యలు తీసుకుంటూ ఎప్పటిది అప్పుడు నిఘవర్గాలను అందుబాటులో పెట్టడంతో జూదం,డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్,అధిక వేగం పెద్ద శబ్దాలతో వాహనాలు బైక్లు నడపడం పట్టాలు ఆడడం ప్రైవేట్ ఫైనాన్సు అన్ని దందాలకు అడ్డుకట్ట వేశారు.ఇప్పుడు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహజాన్ పేరు వింటేనే అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి.ఇంతకు ముందు మంచిర్యాల డిసిపి,సిరిసిల్ల ఎస్పీగా ఉన్నప్పుడు అక్కడ సైతం అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించారు.ఉన్నత అధికారులు అంటే ఇలా ఉండాలని స్థానిక ప్రజల్లో డిపార్ట్మెంట్లో సైతం మంచి పేరు తెచ్చుకున్నారు.అఖిల్ మహాజన్ మంచిర్యాలను వీడిన తర్వాత రియల్ ఎస్టేట్,ప్రైవేట్ ఫైనాన్స్,అక్రమ రేషన్ దందా మళ్లీ జోరుగా కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దోడ్డురకం బియ్యం పంపిణీ చేయడం వల్ల ప్రజలు తినలేక వ్యాపారులకు అమ్ముకుంటున్నారని అక్రమ రేషన్ బియ్యాన్ని అడ్డుకట్ట వేయాలని,ఆలోచనతోని ప్రజల బాగోగులు కోరి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న రకం బియ్యాన్ని పంపిణీ చేస్తుంటే కొంతమంది కార్డు హోల్డర్లు ఇప్పుడు సైతం బియ్యాన్ని రేషన్ డీలర్లకు,రేషన్ బియ్యం వ్యాపారాస్తులకు అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది.బియ్యాన్ని అమ్ముకుంటున్న కొంత మందికార్డు హోల్డర్లకు మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్ రేషన్ కార్డులను రద్దు చేయడం జరిగింది.ఇప్పుడు సైతం సన్న బియ్యం ప్రభుత్వ పంపిణీ చేస్తున్న తినకుండా వ్యాపారస్తులకు అమ్ముకునేటువంటి కార్డు హోల్డర్ల కార్డులను రద్దు చేయాలని నిజమైన పేదవారికి ఈ పథకం దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.రెండు రోజుల క్రితం మంచిర్యాల జిల్లా హాజీపూర్ లక్షిటిపేట నుండి వరంగల్ జిల్లాకు అక్రమ పిడిఎస్ రేషన్ బియ్యాన్ని భారీ వాహనంలో సరఫరా చేస్తుండగా పెద్దపల్లి జిల్లా ధర్మారంలో టాస్క్ ఫోర్స్ అధికారులు ఆ లారీని పట్టుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేయడం జరిగింది.

**హాజీపూర్,లక్షిట్టిపేట కేంద్రాలుగా పిడిఎస్ దందా....**

అదిలాబాద్ ఎస్పిఐ భయానికి ఆదిలాబాద్ జిల్లాలో పిడిఎస్ ఆక్రమ దందా చేసే వారు ఆ వ్యాపారానికి ముగింపు పలకడంతో దండేపల్లి లక్షిట్టిపేట్,హాజీపూర్ మండలాల నుండి అక్రమార్కులు కార్డు హోల్డర్ల దగ్గర,రేషన్ షాప్ డీలర్ల వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఊరి చివర డేరాలలో నిలువ ఉంచి అక్కడినుండి ఓ రైస్ మిల్ కేంద్రంగా అక్రమ పిడిఎస్ బియ్యం దందా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.టాస్క్ ఫోర్స్ మంచిర్యాల జిల్లా సివిల్ సప్లై అధికారులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ నగర్, హాజీపూర్ మండలం దొనబండ లక్షిటిపేట దండపెల్లి మండలాలపై దృష్టి సారించి అక్రమ రేషన్ ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఎంత ఉంది.రేషన్ బియ్యం అమ్మినటువంటి కార్డు హోల్డర్ల కార్డులను రద్దుచేసి అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటేనే అక్రమ రేషన్ రవాణా దందాను అడ్డుకట్ట వేయవచ్చని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కొంతమంది రైస్ మిల్లర్లు ఈ అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది.గతంలో మంచిర్యాల ఆసిఫాబాద్ కరీంనగర్,పెద్దపల్లి జిల్లాల నుండి మహారాష్ట్రలోని సిరివంచకు అక్రమ రేషన్ బియ్యం రవాణా రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగేది మరి ఇప్పుడు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడవలసి ఉంది.

# ఆపరేషన్ సింధూర్ తో పాక్‌కు బుద్ధి చెప్పిన త్రివిధ దళాలు





**దేశంలో భారతీయులంతా ఐక్యంగా ఉంటే దేశం అభివృద్ధి.. రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,మే17(సూర్యరేఖ)** దేశ ఐక్యతకు చిహ్నంగా త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నిర్వహించతలపెట్టిన తిరంగ యాత్రను విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇంచార్జ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయం నియోజకవర్గం పలు ముఖ్య నాయకులతో చేవెళ్ల పార్లమెంటు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కి ప్రధాని మోదీ సరైన గుణపాఠం చెప్పార ని ఆపరేషన్ సింధూర్‌లో ఆర్మీ చేసిన సాహసం మరువలేనిదని కొనియాడారు. మన దేశాన్ని మనల్ని కాపాడిన జవాన్లకు సెల్యూట్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలంటే ఆపరేషన్ సిందూర్ అవసరమని ఆయన అన్నారు.శత్రువును మట్టుపెట్టేందుకు భారతీయ సైనికులు మొదలు పెట్టిన పోరుకు సంఘీభావంగా ప్రజలంతా నడవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారిని తుదముట్టించాలన్నదే మోదీ సంకల్పం అన్నారు.ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్కు భారతీయ సైనికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. దేశం గర్వించదగిన రీతిలో సైనికులు పోరాడుతున్నారన్నారు.ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంతో భారత్ చూపిన తెగువ మరువలేనిదని తెలిపారు. అలాంటి త్రివిధ దళాలకు అండగా ఉండాల్సిన



అవసరం ఉందన్నారు.

## రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ మీడియా కన్వీనర్ మరియు ఏజీఎం ఇన్చార్జిగా నీలం రమేష్ నూతన నియామకం



**కామారెడ్డి,మే17(సూర్య రేఖ)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ మీడియా కన్వీనర్,ఏజీఎం ఇంచార్జిగా నీలం రమేష్ ను రెడ్ క్రాస్ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి నూతనంగా నియమించారు.ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తన అనుభవాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖకు అందించడం కోసం ఈరోజు నూతనంగా మీడియా కన్వీనర్ గా నియమించారు. భవిష్యత్తులో జరగబోయే బ్లడ్ సెంటర్ మరియు జన ఔషధీ మెడికల్, షాపు నిర్మాణంలో పాలుపంచుకొని రెడ్ క్రాస్ నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా మీడియా ద్వారా పబ్లిసిటీ చేయడం కోసం,తనను మీడియా కన్వీనర్,ఏజీఎం ఇన్చార్జిగా నియమించిన హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.అంతేకాకుండా మొత్తం రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

## బెల్లంపల్లి ఎమ్మార్వోగా బాధ్యతలు తీసుకున్న కృష్ణ



**బెల్లంపల్లి,మే17(సూర్యరేఖ)** బెల్లంపల్లి నూతన ఎమ్మార్వోగా కృష్ణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు.కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.మండలంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తానని,భూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ తనకు పూర్తి సహకారం అందించాలని కోరారు భూ సమస్యలు ఏమున్నా తమ వద్దకు వచ్చే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## భారత రాష్ట్ర సమితి ఇక ఇంటికే

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**




**కామారెడ్డి,మే17(సూర్య రేఖ)** రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ కనుమ అవ్వడం ఖాయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇటీవల కాలంలో గులాబీ నేతలు తమ ఉనికిని కాపాడుకునేందుకు అపసోపాలు పడుతున్నారని కామెంట్ చేశారు.భారత రాష్ట్ర సమితి పార్టీలో కవిత కేటీఆర్ హరీష్ రావుల మధ్య విభేదాలు మొదలై తారాస్థాయికి చేరాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్కు ప్రజా సమస్యలపై పట్టింపులేదని,ఆ పార్టీలో ఉన్న నాయకులంతా అంతేనని ఫైర్ అయ్యారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సైనికులుగా పనిచేసే పార్టీ విజయానికి కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

## ఎక్లాస్ పేటలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

**షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగ్రామం ఎక్లాస్ ఖాన్ పేట్ గ్రామం లో మంజూరు అయినా 37 ఇళ్ల నిర్మాణాలకు శంఖస్థాపన చేసి లబ్దిదారులకు నిధులు మంజూరు కి సంబందించిన పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేస్తున్నామని, గత పాలకుల లాగా కక్ష్య సాధింపు రాజకీయాలు చెయ్యమని అన్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

# ఎస్పీఆర్ హిల్స్ ప్రాంత ప్రజల తీరిన దాహార్తి..!!





**రూ. 5.7 కోట్లతో నిర్మించిన రిజర్వాయర్ ప్రారంభం..**
**బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ల తీరన ప్రజల ఇక్కట్లు..**
**52 బస్తీలకు,పరిసర ప్రాంతాలకు లబ్ధి..**
**ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం, మేయర్**

**రాజేంద్రనగర్,మే17(సూర్యరేఖ)** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత,ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోంది. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.అందులో భాగంగా నగరంలో రూ.5.7 కోట్లతో రహమత్ నగర్ డివిజన్ లోని ఎస్పిఆర్ హిల్స్ లో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ ను శనివారం రోజున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ,రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి హైదరాబాద్ ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.జిహెచ్ఎంసి పరిధిలో బోరబండ రహమత్ నగర్ డివిజన్ లలోని 52 బస్తీల్లోని,పలు కాలనీల నీటి సమస్యను తీర్చడానికి ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో 3 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ ను నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది.రికార్డ్ స్థాయిలో ఏడాదిన్నరలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే..రెండు డివిజన్ల పరిధిలోని 52 బస్తీల లలోని 15 వేల కనెక్షలకు లబ్ధి చేకూరుతుంది. దీంతోపాటు ఈ ప్రాంతం ఎక్కువగా ఎత్తు పల్లంగా ఉండడంతో లో ప్రెషర్ తో నీటి సరఫరా జరిగేది..ఆ సమస్య పరిష్కారం అవుతుంది.అలాగే ఈ రిజర్వాయర్ నిర్మాణం వల్ల బోరబండ రహమత్ నగర్ డివిజన్లోని 52 బస్తీల్లోని ప్రజలకు నీటి ఇబ్బందుల నుండి శాశ్వతంగా విముక్తి లభించింది.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హైదరాబాద్ లో తాగు నీటి సమస్య పరిష్కారం చేయడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఓఆర్ ఆర్ వరకు విస్తరించిన ప్రాంతంలో గత 10 సంవత్సరాల్లో 13.80 లక్షల నల్లా కనెక్షన్లు పెరిగాయన్నారు. అలాగే దాదాపు 7 వేల కోట్లతో 20 టీఎంసీల నీటిని తీసుకొచ్చే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుందని వివరించారు.ఈ రిజర్వాయర్ నిర్మాణంతో రహమత్ నగర్,బోరబండ ప్రజలు చాలా కాలంగా ఎదుర్కుంటున్న సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా ఈ రిజర్వాయర్ పూర్తి చేయాలని,రహమత్ నగర్ ప్రజలు ఆందోళన చేశారు.అనేక ఆందోళనల తర్వాత పూర్తి అవ్వడం సంతోషంగా ఉందని అన్నారు.గత పదేళ్లలో ఒక్క చుక్క అదనపు నీరు నగరానికి అందలేదని శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి నీటిని పెంచాల్సిన అవసరం ఉంది అని ముగించారు.ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ..ఈ ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులకు నీటి సరఫరా చేయడంతో ప్రజలు ఇబ్బంది పడేవారని అన్నారు. దీంతోపాటు మరికొన్ని బస్తీల్లో రాత్రి సమయంలో నూ మంచినీటి సరఫరా చేయడం,లో ప్రెషర్ లాంటి సమస్యలు ఉండేవి..అవన్నీ ఈ రిజర్వాయర్ ప్రారంభంతో తీరిపోతున్నాయని వివరించారు. అలాగే ఈ రిజర్వాయర్ నిర్మాణంతో అన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయడంతో పాటు రాత్రి సమయంలో కాకుండా ఉదయం నుండి సాయంత్రం సమయాల్లో సరఫరా చేసే వెసులుబాటు ఉంటుందని అన్నారు. మొత్తం రూ.5.7 కోట్లతో నిర్మించిన ఎస్పిఆర్ హిల్స్ రిజర్వాయర్ వల్ల బోరబండ,రహమత్ నగర్ డివిజన్లలోని 52 బస్తీలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.కోటి ముప్పై లక్షల జనాభా ఉన్న నగరానికి ప్రతినిత్యం 555 ఎంజిడీల నీటిని సరఫరా చేస్తున్నామని..అయినా కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒక్కసారైనా సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు.అయితే ప్రభుత్వం గోదావరి ప్రాజెక్టు ఫేజ్ 2కు అనుమతులు ఇచ్చిందని..ఇప్పుడు ఆ ప్రాజెక్టు టెండర్ దశ పూర్తిచేసుకుందని చెప్పారు.త్వరలో నిర్మాణ పనులకు చేపడతామని..ఈ గోదావరి ప్రాజెక్టు పేజ్-2 పూర్తి చేస్తే నగరానికి 20 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉందని అన్నారు.ఈ జలాలతో నగరానికి 30 సంవత్సరాలు వరకు సంవృద్ధిగా నీటి సరఫరా చెయ్యవచ్చని ఎండీ ధీమా వ్యక్తం చేశారు.అలాగే నగరంలో జలమండలి సరఫరా చేస్తున్న నీటిలో ప్రజల ఇంటి వద్ద అధికంగా నీటి వృథా జరుగుతుందని అన్నారు.ఈ నీటి వృథాను తగ్గించేందుకుని..నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు ఎండీ అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో జల మండలి ఈడి మయాంక్ మిట్టల్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్చార్జి అజారుద్దీన్ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ కార్పొరేటర్లు సిఎన్ రెడ్డి,బాబా ఫసియుద్దిన్ జలమండలి ఈడి మయాంక్ మిట్టల్ డైరెక్టర్లు అధికారులు అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘన విజయం





**రాజేంద్రనగర్,మే17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘన విజయం సాధించింది.శనివారం జరిగిన ఓట్ల లెక్కింపు లో మొదటి నుంచి శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఆధిక్యత కనబరుస్తూ వచ్చింది.వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ఈ నెల 16న ఎన్నికలు జరుగగా శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు రాజేంద్రనగర్ వ్యవసాయ కలశాలలో జరిగింది. అధ్యక్షుడుగా ఎం.శ్రీనివాస్ యాదవ్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.రాజు ఉపాధ్యక్షునిగా దశరథ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జయరాం సంయుక్త కార్యదర్శిగా జీ.పరమేశ్, కార్యనిర్వాణ కార్యదర్శిగా ఎస్.రవీందర్ రెడ్డి,క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.సంజీవ రెడ్డి,సాంకేతిక కార్యదర్శిగా జీ.సులోచన, కోశాధికారిగా ఎస్.కె.నజీర్,లు విజయం సాధించారు.




**భారీ ఊరేగింపు :**
వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఘన విజయం సాధించిన ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ సభ్యులు ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్ లో ఊరేగింపు నిర్వహించారు.

## ఘనంగా సినీయర్ డైనమిక్ లీడర్ గంగాధర్ జన్మదిన వేడుకలు



**మెహిదీపట్నం,మే17(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ సినీయర్ డైనమిక్ లీడర్ గంగాధర్ జన్మదిన వేడుకలు గుడిమల్కాపూర్ డివిజన్ భాజపా అభివృద్ధి కార్యాలయంలో ఘనంగా జరిగియి.భారతీయ జనతా పార్టీ సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అద్యక్షులు దేవర వంశీ,సీనియర్ నాయకులు గంగాధర్ ను మర్యాద పూర్వకంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తేలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మికాంత్ యాదవ్,మధు,మనీష్,నాగరాజ్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దూరి శ్రావణ్ కుమార్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 17 (సూర్య రేఖ)**ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పెద్దూరి శ్రావణ్ కుమార్ ను బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. గత కొంత కాలంగా బీసీ హక్కుల కోసం పని చేస్తున్ననందున వారి సేవలను గుర్తించి ఈ నియామకాన్ని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, బీసీ యువజన సంఘం జిల్ల పల్లి అంజి, జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్ లు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ముస్తాబాద్ లో సంబరాలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా,మే17(సూర్యరేఖ):**భారత సుందర కాశ్మీరాన్ని సింధూర కాశ్మీరంగా మార్చి భారత మాత నుదుటన కుంకుమ దిద్దిన ఆపరేషన్ సిందూర్ కు యావత్ భారత్ మద్దత్ తెలుపుతూ పాకిస్తాన్ ను ప్రపంచ పటములో లేకుండా ఉగ్రవాదాన్ని పెంచి పోచిస్తున్న పాక్ ను ధ్వంసం చేయాలని బీజేపీ పార్టీ ముస్తాబాద్ మండలం తరపున దేశ ప్రధానిని ముక్తా కంఠముతో కోరారు.అలాగే యుద్ధం కోసం రైళ్లలో తరలి వెళ్తున్న సైనికులకు సీట్లను ఇస్తూ వారికి మనం ఉన్నామని ధైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం మనపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ పట్టణ అధ్యక్షులు మెంగనీ మహేందర్, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్,ఉపాధ్యక్షుడు ఎదునూరి గోపి,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు వరి వెంకటేష్,చిత్నేని శ్రీనివాస్ రావు,ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు రయాం రాజు,కరెడ్ల రమేష్ రెడ్డి,మీసా శంకర్,గూడ బాల్ రెడ్డి,మహేష్,కార్తీక్ రెడ్డి,నర్రా ప్రశాంత్ రెడ్డి,పిట్ల రాజు,మద్దికుంట రమేష్,ఓరగంటి సత్యం,కదిరే తిరుపతి,ఎబివిపి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా డి అభ్యర్ధుల ధర్నా

**హైదరాబాద్ :** గత 12 సంవత్సరాల నుండి ఫార్మ్ డి డాక్టర్ లకు గవర్నమెంట్ ఆసుపత్రిలో క్లినికల్ ఫార్మాసిస్టులకు ఉద్యోగ అవకాశాల్లో కల్పించకుండా గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ ఫార్మా డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శీలం వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఫార్మా డి నిరుద్యోగుల డాక్టర్ ల సంఘం ఆధ్వర్యంలో ధర్నాను చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో ఇండియాలోనే తెలంగాణ రాష్ట్రంలో ఫార్మసిస్ట్ కోర్సులను ప్రారంభించడనీ జరిగిందని గుర్తు చేశారు.అలాంటిది నాటి నుండి నేటి వరకు కూడా ఇప్పటి వరకు ఒక్క ఫార్మసిస్ట్ ఉద్యోగ నోటిఫికేషన్ ను జారీ చేయలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరువ తీసుకొని ఫార్మసిస్టు ఉద్యోగుల నోటిఫికేషన్ ను జారీ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



# రక్తం పంచుకు పుట్టిన వాళ్లే నా పతనాన్ని కోరుతున్నారు

## మంచు విష్ణు సంచలన కామెంట్స్




గత కొద్ది రోజులుగా మంచు ఫ్యామిలీ గొడవలపై నిత్యం ఏదో ఒక వార్త వస్తూనే ఉంది. ఆస్తి గొడవలు అని కొందరు అంటుంటే, లేదు లేదు ఇతర విషయాలలో గొడవలు అని అనేక ప్రచారాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంచు విష్ణు తాను నటించిన కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో భాగంగా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ చిత్రాన్ని 2 వేల థియేటర్లలో విడుదల చేయనున్నారు. అయితే తాజాగా.. ఓ పాడ్ కాస్ట్‌లో మంచు విష్ణు మాట్లాడుతూ.. ముందుగా ప్రభాస్‌తో తనకి ఉన్న అనుభందాన్ని తెలియజేశారు. సినిమాలో నటించినందుకుగాను ఒక్క రూపాయి కూడా రెమ్యునరేషన్ తీసుకోలేదని తెలిపారు. ప్రభాస్ నేను చాలా క్లోజ్. అతను ఎంత పెద్ద స్టార్ అనేది అతడికి తెలియదు. అతని లోకంలో అతనిది. ఎవరి గురించి పట్టించుకోడు. షూటింగ్ కి వచ్చాడా వెళ్లిపోయాడా.. అంతే. ఆసియాలోనే బిగ్గెస్ట్ స్టార్స్ లో ఒకరిగా ఉంటూ కూడా అంత హంబుల్ గా ఉండటం అతని గొప్పతనం. 'నువ్వు ఏ రోజుకీ మారకూడదు ప్రభాస్.. నువ్వు ఇలాగే ఉండాలి' అని అంటే.. 'ఏముంది, మనం ఎప్పుడూ ఇంతే కదా' అన్నాడు. అతను ఎల్లప్పుడూ అలానే ఉంటాడు అని మంచు విష్ణు చెప్పుకొచ్చాడు. ఇక 15 ఏళ్ల క్రితం ఓసారి నేనూ ప్రభాస్ మాట్లాడుకుంటున్నప్పుడు, నువ్వు ఎందుకు ఎక్కువ కలవవు అని అడిగాడు ప్రభాస్. ఎక్కువ కలిస్తే నేను నీకు నచ్చను బ్రదర్ అని అన్నాను అని మంచు విష్ణు తెలిపాడు ..మూడు నెలలకో ఆరు నెలలకో ఒకసారి కలుసుకుంటే, మనం ఎప్పటికీ గ్రేట్ ఫ్రెండ్స్ గా ఉంటాం. ఎందుకంటే మనిద్దరం వేర్వేరు బడుల నుంచి వచ్చాం. నేను లేచే టైం.. నీ పడుకునే టైం. రెండూ డిఫరెంట్ కదా . అయినా సరే మనం ఎప్పటికీ మంచి సోదరులమే అని అతనితో చెప్పాను. రక్తం పంచుకొని పుట్టినవాళ్లే ఈరోజు నా పతనాన్ని కోరుకునేటప్పుడు.. నేను, ప్రభాస్ రక్తం పంచుకొని పుట్టకపోయినా నా మంచి కోరి నా సక్సెస్ కోరుతున్నాడు. ఎన్ని జన్మలకైనా అతనికి నేను రుణపడి ఉంటాను. నిజంగా ప్రభాస్ కి నేను కృతజ్ఞుడిగా ఉంటాను అని మంచు విష్ణు అన్నారు. తన తండ్రి సంతోషమే తనకు ముఖ్యమని.. ఆయనకు మంచి పేరు తీసుకురాకపోయినా పర్వాలేదు కానీ ఆయనకు చెడ్డపేరు తీసుకురాకూడదని మంచు విష్ణు అన్నారు.

## చిరంజీవి- అనిల్ రావిపూడి సినిమా..

# ఎంట్రీ ఇచ్చేసిన హీరోయిన్


చిరంజీవి- అనిల్ రావిపూడి ప్రాజెక్ట్‌లోకి నయనతార ఎంట్రీ ఇచ్చేశారు. ఈమేరకు తాజాగా చిత్రయూనిట్ ఒక వీడియోను షేర్ చేస్తూ స్వాగతం పలికింది. కొద్దిరోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభోత్సవం జరిగింది. సాహు గారపాటి, సుష్మితా కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిరంజీవి 'రా' (రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) ఏజెంట్‌గా కనిపించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. భీమ్స్ సెసిరోలియో సంగీతం అందించనున్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ మూవీ 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

వీవస్త్రు%157లో నయనతార నటిస్తున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. దీనిని ధృవీకరిస్తూ నయనతారతో ఒక ఫన్నీ వీడియోను క్రియేట్ చేసి విడుదల చేశారు. జూన్‌లో ప్రారంభం కానున్న షూటింగ్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొననున్నారు. ఈ చిత్రంతో చాలారోజుల తర్వాత నయనతర హీరోయిన్‌గా తెలుగులో మళ్లీ అడుగుపెడుతున్నారు. ఇక ఈ సినిమా కోసం అతిథి పాత్రలో వెంకటేశ్ నటించనున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఈ సినిమాప్రారంభోత్సవంలో చిరంజీవిపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి వెంకటేశ్ క్లాప్ కొట్టారు... సో.. అతిథి పాత్ర చేస్తున్నారు కాబట్టిప్రారంభోత్సవంలో అతిథిగా పాల్గొన్నారనే ఊహాగానాలు ఉన్నాయి. ఈ విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది




# దాదా సాహెబ్ ఫాల్కే గెటప్‌లో ఎన్టీయార్ స్టిల్స్ బయటకు...

దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి అనే పేరు సెన్సేషన్ అనే పదం రెండూ చెట్టాపట్టాలేసుకుని పక్కపక్కనే నడుస్తుంటాయి. ప్రస్తుతం మహేష్‌బాబుతో సినిమాకు సంబంధించి ఒక్క వార్తా బయటకు రాకుండా సినీ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఈ సక్సెస్ ఫుల్ డైరెక్టర్... ఇటీవలే తాను తీయబోయే మహాభారతం సినిమా గురించి ఓ అప్‌డేట్‌గా హీరో నాని కి పాత్ర ఇవ్వనున్నట్టు చెప్పి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అదే క్రమంలో ఇప్పుడు మరోసారి ఆయన అంతకు మించిన సంచలనాన్ని సృష్టించారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ ను సినిమాగా సమర్పించబోతున్నానని ప్రకటించారు. అంతేకాదు ఆయన చేసిన ప్రకటనను బట్టి చూస్తుంటే ఆ సినిమాలో కథానాయకుడి పాత్రను జూ.ఎన్టీయార్ పోషించబోతున్నారని దాదాపుగా రూఢీ అయింది. నిజానికి ఇది ఆయన రెండేళ్ల నాడే చెప్పిందే అయినప్పటికీ... ముడి సరకు అంతా రెడీ అయిపోయింది... ఇక షూటింగ్ పట్టాలెక్కబోతోంది అని ఆయన ప్రకటనతో తేలిపోయింది. తాజాగా ఆయన చేసిన పోస్ట్ ఇలా ఉంది..“నేను మొదటిసారి కథ విన్నప్పుడు, అది నన్ను మరేదీ లేని విధంగా భావోద్వేగపరంగా కదిలించింది. బయోపిక్‌ను సినిమాగా తీయడం చాలా కష్టం, ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా గురించి ఊహించడం మరింత సవాలుతో కూడుకున్నది. అయితే మా అబ్బాయిలు దానికి సిద్ధంగా ఉన్నారు సగర్వంగా, మేడ్ ఇన్ ఇండియాను ప్రజంట్ చేస్తున్నాను” రాజమౌళి ఈ చిత్రాన్ని ప్రకటించి రెండు సంవత్సరాలు అయింది. అప్పుడే ఈ చిత్రానికి మేడ్ ఇన్ ఇండియా అని పేరు పెట్టారు. ఇలా రాజమౌళి పోస్ట్ చేశారో లేదో... అలా ఈ పాత్రకు ఎన్టీయార్ పోషించబోతున్నారని వార్తలు వ్యాపించాయో లేదో... అంతే... ఆధునిక సాంకేతిక యుగపు నిపుణులు తమ టాలెంట్‌కు పదును పెట్టారు. దాదా సాహెబ్ ఫాల్కే పాత్రలో యంగ్ టైగర్ ఎలా ఉంటాడు అనేదానిపై తమ ఊహలకు రూపాల్ని ఇస్తున్నారు. వారికి అత్యాధునిక ఏఐ వంటి టెక్నాలజీలు తోడయ్యాయి. దాంతో జూనియర్ ఎన్టీఆర్ దాదా గెటప్ చిత్రాలు ఇంటర్నెట్‌లో తుఫానుగా మారాయి, ఏఐ రూపొందించిన ఈ చిత్రాలలో జూనియర్ ఎన్టీఆర్ దాదాసాహెబ్ ఫాల్కే పాత్రలో ఇమిడిపోయినట్టు కనిపిస్తున్నాడు, ఖాదీ కుర్తా ధరించి, కళ్ళద్దాలు గడ్డం తో ఆకట్టుకుంటున్నాడు



# ఎన్టీఆర్ బర్త్‌డే స్పెషల్.. థియేటర్స్‌లో 'యమదొంగ'

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మోహన్ బాబు, ప్రియమణి, మమత మోహన్‌దాస్ కాంబినేషన్‌లో వచ్చిన ఐకానిక్ సోషియో ఫాంటసీ చిత్రం 'యమదొంగ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా ఈ చిత్రాన్ని మే 18 నుంచి రీ రిలీజ్ చేయనున్నారు. రీ రిలీజ్ కోసం టీం అమితంగా శ్రమించినట్లు తెలుస్తోంది. 'యమదొంగ'ను 8%ఖ%లో స్కాన్ చేసి, 4%ఖ% నాణ్యతకు కుదించి, అసాధారణమైన దృశ్య అనుభవాన్ని అందించేలా సిద్ధం చేశారు. ఈ అత్యాధునిక టెక్నాలజీతో అభిమానులు సినిమాను మరింత ఉన్నత నాణ్యతలో ఆస్వాదించవచ్చు. సోషల్ మీడియాలో 'యమదొంగ' రీ రిలీజ్ సందడి జోరుగా సాగుతోంది. ప్రధాన నటీమణులు ప్రియమణి, మమత మోహన్‌దాస్ షూటింగ్ రోజుల జ్ఞాపకాలను పంచుకుంటూ విడుదల చేసిన వీడియోలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాజమౌళి దర్శకత్వ విజన్, ఎంఎం కీరవాణి సంగీతంతో 'యమదొంగ' మరోసారి తెరపై సందడి చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ ఎత్తున రీ రిలీజ్ చేస్తున్నారు.

# 'పూరిసేతుపతి' ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్



సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక ఎన్‌ఎమ్ క్రేజీ పాన్ ఇండియా సినిమాలో నటించే అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో తమిళ స్టార్ విజయ్ సేతుపతికి జోడీగా ఆమె కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. కానీ, నిహారిక ఎన్‌ఎమ్ ఇటీవలే తమిళంలో 'పెరుసు' సినిమాతో నటిగా పరిచయమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు పూరి జగన్నాథ్ మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్‌లో ఆమెకు కీలక పాత్రలో అవకాశం వచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. PuriSethupathi అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. నిహారిక ఎన్‌ఎమ్ సోషల్ మీడియాలో తన కంటెంట్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు భారీ సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నారు. ఇప్పుడు ఆమె పాన్ ఇండియా సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనుందనే వార్తలతో అభిమానులు, సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇది ఆమె నటిగా కెరీర్‌లో మరో ముఖ్యమైన అడుగు కానుంది. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జూన్ 2025 నుంచి సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఈ సినిమాలో టబు, కన్నడ నటుడు దునియా విజయ్ కూడా ముఖ్య పాత్రల్లో నటించనున్నట్లు సమాచారం.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,